


సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ నాయకత్వంలో పారిశ్రామికాభివృద్ధి, ఉద్యోగ కల్పనలో అధికారిక రికార్డులే విజయాలకు నిదర్శనం. వైసీపీ ఐదేళ్ల పాలనలో తీసుకొచ్చిన పరిశ్రమలు, ఆకర్షించిన పెట్టుబడులు, కల్పించిన ప్రైవేట్ ఉద్యోగాలపై ఇప్పటికీ సమాధానం లేదు.

**ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ**


గురువారం 17.09.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 సంచిక - 147 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00



## ఖాకీ కొలువులకు.. భారీ నోటిఫికేషన్



- పోలీసు శాఖలో 2,050 పోస్టుల భర్తీ
- ఎస్సై, కానిస్టేబుల్‌తో పాటు ఇతర విభాగాల్లో అవకాశాలు
- అర్హతలు, వయోపరిమితి పరిశీలించుకోవాలని సూచన

**అమరావతి, సెప్టెంబరు 16 (జర్నలిస్ట్ ఫైల్):** పోలీసు ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. ఆంధ్రప్రదేశ్ పోలీసు శాఖలో మొత్తం 2,050 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందులో 378 ఎస్సై పోస్టులు, 1,156 కానిస్టేబుల్ పోస్టులతో పాటు వివిధ విభాగాల్లోని ఇతర పోస్టులు ఉన్నాయి. ఎస్సై సివిల్ విభాగంలో 253, ఆర్మ్‌డ్ రిజర్వ్ విభాగంలో 116, ఎస్పీఎఫ్‌లో 9 పోస్టులను భర్తీ చేయనున్నారు. కమ్యూనికేషన్ విభాగంలో 50 ఎస్సై పోస్టులు, పీటీవో విభాగంలో 10 ఎస్సై పోస్టులకు కూడా నోటిఫికేషన్ జారీ చేశారు.

కానిస్టేబుల్ కేటగిరీలో సివిల్ విభాగంలో 542, ఆర్మ్‌డ్ రిజర్వ్‌లో 285, అగ్నిమాపక శాఖలో 158 పోస్టులను భర్తీ చేయనున్నారు. జైలు శాఖలో పురుష జైలు వార్డెన్లకు 150, మహిళా జైలు వార్డెన్లకు 21 పోస్టులు ఉన్నాయి. మిగతా 2లో...



## అల్ట్రా మెగా ప్రాజెక్టుగా బీపీసీఎల్ రిఫైనరీ



- బీపీసీఎల్ ప్రాజెక్టు పనులు వేగంగా ప్రారంభించాలి
- రూ.1.45 లక్షల కోట్లతో 9 మిలియన్ టన్నుల సామర్థ్యం
- రిఫైనరీ సమీపంలో 1,500 ఎకరాల్లో పెట్రోకెమికల్స్ పార్క్
- అక్టోబరులో తుది పెట్టుబడి వ్యయం ఖరారు

**అమరావతి, సెప్టెంబరు 16 (జర్నలిస్ట్ ఫైల్):** రామాయపట్నం పోర్టు సమీపంలో భారత్ పెట్రోలియం కార్పోరేషన్ లిమిటెడ్ బీపీసీఎల్ చేపట్టనున్న గ్రీన్ ఫీల్డ్ రిఫైనరీ కమ్ పెట్రోకెమికల్ ప్రాజెక్టు పనులు త్వరితగతిన ప్రారంభించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. రిఫైనరీ సమీపంలో పెట్రో కెమికల్ పార్కును కూడా ఏర్పాటు చేయాలని సీఎం ప్రతిపాదించారు. భారత్ పెట్రోలియం కార్పోరేషన్ సీఎండీ సంజయ్ ఖన్నా ముఖ్యమంత్రితో సమావేశం అయ్యారు. ప్రకాశం-నెల్లూరు జిల్లాల మధ్య ఏర్పాటు కానున్న బీపీసీఎల్ రిఫైనరీ ప్రాజెక్టు వ్యయం దాదాపు రూ. 1.45 లక్షల కోట్లకు చేరిందని ఆయన ముఖ్యమంత్రికి తెలిపారు. ఏడాదికి 9 మిలియన్ టన్నుల సామర్థ్యంతో ఇంటిగ్రేటెడ్ గ్రీన్ ఫీల్డ్ రిఫైనరీని ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. ప్రాజెక్టుకు తుది పర్యావరణ అనుమతి సెప్టెంబరు చివరి నాటికి వచ్చే అవకాశం ఉందని బీపీసీఎల్ సీఎండీ సీఎంకు తెలిపారు. ఇంజినీరింగ్ ఇండియా లిమిటెడ్ చేపట్టిన అధ్యయన నివేదిక వచ్చిన వెంటనే ఈ ఏడాది అక్టోబరు నెలలోనే తుది పెట్టుబడి వ్యయం ఖరారు అవుతుందని వివరించారు. ఆ తదుపరి రిఫైనరీ నిర్మాణ పనుల్ని ప్రారంభిస్తామని స్పష్టం చేశారు.

• వివరాలు 2 లో

## అర్హుడికి రుణమే.. లక్ష్యం



- ప్రతి అర్హుడికీ బ్యాంకింగ్ సేవలు చేరాలన్న సీఎం
- ఎంఎస్ఎంఈలు, వ్యవసాయం, కౌలు రైతులకు రుణాలపై దృష్టి
- లక్ష్యాలు చేరని బ్యాంకులపై సమీక్షకు నిర్ణయం

2 లో

### హజ్ యాత్రకు..
## వైద్య పరీక్షలు తప్పనిసరి

- ఈ నెల 30 వరకు గడువు
- అక్టోబర్ 1లోపు సర్టిఫికెట్లు, రసీదు అప్‌లోడ్



**అమరావతి, సెప్టెంబరు16(జర్నలిస్ట్ ఫైల్):** హజ్-2027 యాత్రకు ఎంపికైన యాత్రికులకు వైద్య పరీక్షలు నిర్వహించి, సంబంధిత ధ్రువీకరణ పత్రాలను సమర్పించేందుకు గడువును ఈ నెలాఖరు 30వ తేదీ వరకు పొడిగించినట్లు రాష్ట్ర మైనారిటీ సంక్షేమ, న్యాయ శాఖల మంత్రి ఎస్ఎండి ఫరూక్ తెలిపారు.

హజ్ కమిటీ ఆఫ్ ఇండియా జారీ చేసిన సర్క్యులర్ నం.13, తేదీ 15.09.2026 ప్రకారం, హజ్ యాత్రకు తాత్కాలికంగా ఎంపికైన యాత్రికులు తప్పనిసరిగా ప్రభుత్వ వైద్య ఆరోగ్య కేంద్రంలో ప్రభుత్వ అల్లోపతిక్ వైద్యాధికారి ద్వారా నిర్దేశిత వైద్య పరీక్షలు చేయించుకుని, ప్రాథమిక వైద్య పరీక్ష, శారీరక దృఢత్వ ధ్రువీకరణ సర్టిఫికెట్ పొందాలని బుధవారం అమరావతిలో విడుదల చేసిన ఒక ప్రకటనలో మంత్రి ఫరూక్ పేర్కొన్నారు. మిగతా 2లో...

## కూటమికి.. వన్‌సైడ్ విక్టరీ!

- స్థానిక ఎన్నికల్లో ఎన్డీఏ జెండా ఎగరాలి
- కేడర్ అప్రమత్తంగా ఉండి వైసీపీ కుట్రలను తిప్పికొట్టాలి
- కార్యకర్తలు ప్రజలతో మమేకం కావాలి
- కుటుంబం వేరు.. రాజకీయం వేరు
- సంక్షేమం, ఆర్థిక స్వావలంబనకు ప్రాధాన్యం: నారా లోకేష్



**కోవూరు (నెల్లూరు జిల్లా) (జర్నలిస్ట్ ఫైల్):** అక్టోబర్, నవంబర్ లో స్థానిక సంస్థల ఎన్నికలు జరగబోతున్నాయి. స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు వన్ సైడ్ విక్టరీ రావాలి, రాష్ట్రవ్యాప్తంగా ఎన్ డిఏ జెండా ఎగరాలని తెలుగుదేశం పార్టీ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ పార్టీ కేడర్ కు పిలుపునిచ్చారు. కోవూరు అసెంబ్లీ నియోజకవర్గ పార్టీ కార్యకర్తల సమన్వయ సమావేశంలో నారా లోకేష్ మాట్లాడుతూ... ఎన్నికల్లో గెలిస్తే కార్యకర్తలకు న్యాయం, ప్రజలకు మరింత సేవ చేయగలమని అన్నారు. వైసిపి నాయకులు ఫస్ట్ గ్రేడ్ క్రిమినల్స్... రాజకీయ ముసుగులో కుల,మత విభేదాలు రెచ్చగొడతారు. మనం అప్రమత్తంగా ఉండాలి. వారి దుష్ప్రచారాన్ని సమర్థవంతంగా తిప్పికొట్టాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉంది. కోడికత్తి డ్రామా చూశాం. సొంత బాబాయిని లేపేసి బాబుగారి చేతిలో కత్తిపెట్టి నారాసుర రక్తచరిత్ర అని రాశారు. ఇటీవల ఈడి అవినాష్ ను పిలిచింది. ఎన్నికల సమయంలో జగన్ గులకరాయి డ్రామా చూస్తే మిగతా 2లో...

### మహిళా క్రికెటర్లకు వేదికగా
## 'విమెన్ ఏపీఎల్'

- 19 నుంచి 27 వరకు మంగళగిరి స్టేడియంలో డే అండ్ నైట్ మ్యాచ్‌లు



**విజయవాడ, సెప్టెంబరు 16 (జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్ర ప్రీమియర్ లీగ్ తరహాలో రాష్ట్రంలోని మహిళా క్రికెటర్లను ప్రోత్సహించేందుకు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళల ఏపీఎల్ టోర్నమెంట్ నిర్వహించనున్నారు. మంగళగిరిలోని అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఈ నెల 19 నుంచి 27 వరకు జరిగే ఈ మెగా టోర్నీలో నాలుగు జట్లు తలపడనున్నాయి. అన్ని మ్యాచ్‌లను డే అండ్ నైట్ విధానంలో ఫ్లడ్‌లైట్ల వెలుగులో నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. విజయవాడలోని ఏసీఏ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఏసీఏ అధ్యక్షుడు, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ టోర్నీ వివరాలను వెల్లడించారు. మిగతా 2లో...

## ప్రతి దశలోనూ.. రోగి భద్రత

- ఎన్‌సీడీ ద్వారా వ్యాధుల గుర్తింపు.. 'సంజీవని'తో నిరంతర వైద్యం
- మందుల భద్రత, సురక్షిత వైద్య విధానాలకు ప్రాధాన్యం
- సెప్టెంబరు 17న ప్రపంచ రోగి భద్రతా దినోత్సవం
- ఆస్పత్రుల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు
- మంత్రి సత్యకుమార్ వెల్లడి



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** రోగికి వైద్యం అందించడం ఎంత ముఖ్యమో.. ఆ వైద్యం వల్ల ఎలాంటి హాని కలగకుండా చూడటం కూడా అంతే ముఖ్యమని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. వ్యాధిని ముందుగానే గుర్తించడం, సకాలంలో చికిత్స అందించడం, మందులను సురక్షితంగా వినియోగించడం, చికిత్స అనంతరం రోగి ఆరోగ్యాన్ని పర్యవేక్షించడం ద్వారా రోగి భద్రతను బలోపేతం చేయాలన్నారు. ఎన్‌సీడీ 4.0లో ఇప్పటికే 2.83 కోట్ల మందికి పైగా పరీక్షలు నిర్వహించగా.. 59.38 లక్షల మందిలో అధిక రక్తపోటు, 48.32 లక్షల మందిలో మధుమేహం గుర్తించినట్లు తెలిపారు. వ్యాధి గుర్తించిన వారికి సకాలంలో వైద్యం అందేలా 'సంజీవని' ద్వారా సేవలను అనుసంధానం చేస్తున్నామని చెప్పారు. సెప్టెంబర్ 17 ప్రపంచ రోగి భద్రతా దినోత్సవం సందర్భంగా మంత్రి బుధవారం ప్రకటన విడుదల చేశారు.

**ముందస్తు పరీక్షలతో వ్యాధి గుర్తింపు :** రక్తపోటు, మధుమేహంతో పాటు నోటి, రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ వంటి అసంక్రమిత వ్యాధులను తొలిదశలోనే గుర్తిస్తే చికిత్స సులభమవుతుందన్నారు. రాష్ట్రంలో 18 ఏళ్లు పైబడిన వారికి ఎన్‌సీడీ 4.0 ద్వారా విస్తృతంగా పరీక్షలు నిర్వహిస్తున్నామని మంత్రి తెలిపారు. క్యాన్సర్ పరీక్షల్లో అనుమానం ఉన్న వారిని తదుపరి పరీక్షలు, అవసరమైన చికిత్స కోసం పంపిస్తున్నామని చెప్పారు. వ్యాధి గుర్తించిన తర్వాత వైద్యం అందడంలో జాప్యం లేకుండా చూడాలని వైద్యులకు సూచించారు. అవసరమైన మందులు సరైన మోతాదులో, సరైన సమయంలో అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మిగతా 2లో...

## ఆంధ్రప్రదేశ్‌కు భారీగా ఇళ్ల కేటాయింపు

- కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 3 లక్షల ఇళ్లు మంజూరు
- ఆంధ్రప్రదేశ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్



**అమరావతి, సెప్టెంబరు 16 (జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర ప్రభుత్వం భారీగా ఇళ్లను కేటాయించిందని ఆంధ్రప్రదేశ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత దేశవ్యాప్తంగా రెండు కోట్ల ఇళ్లను మంజూరు చేయగా, అందులో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు కలిపి ఐదు లక్షల ఇళ్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు ఇప్పటికే 74 వేల ఇళ్లు మంజూరు కాగా, మిగతా 3లో...

## వెటర్నరీ పోస్టుల భర్తీపై అసత్య ప్రచారం



- నిబంధనల మేరకే పోస్టుల విభజన, వెయిటేజీ: పశు సంవర్ధక శాఖ

**అమరావతి, సెప్టెంబరు 16 (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలో 164 వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ పోస్టుల భర్తీకి సంబంధించి కొంతకాలంగా జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని పశుసంవర్ధక శాఖ స్పష్టం చేసింది. మిగతా 3లో...

### ఆధ్యాత్మికతకు..
## ప్రపంచ నమూనా తిరుమల!



- భక్తుల అనుభూతికి ఎక్స్‌పీరియన్స్ సెంటర్
- రూ.104 కోట్లతో ఎస్వీ మ్యూజియం ఆధునీకరణ
- భక్తుల కోసం 32 ఈవీ బస్సులు
- ప్రతి భక్తుడికీ రూ.2 లక్షల బీమా
- రాష్ట్రంలో 5 వేల శ్రీవారి ఆలయాల నిర్మాణం

**తిరుమల, సెప్టెంబరు 16 (జర్నలిస్ట్ ఫైల్) :** తిరుమలను పవిత్రమైన దివ్యక్షేత్రంగా, ఆధ్యాత్మికతకు ప్రపంచ స్థాయి నమూనాగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. తిరుమలలో భక్తులకు మెరుగైన అనుభూతిని అందించడంతో పాటు పర్యావరణ పరిరక్షణ, ఆధ్యాత్మికత, సేవాభావం, ఆధునిక సాంకేతికతను సమన్వయం చేస్తామని చెప్పారు. తిరుమల కొండల్లో 89.5 శాతం గ్రీన్ కవర్ ఉందని, దీన్ని మరింత పరిరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. బుధవారం తిరుమలలో పలు అభివృద్ధి కార్యక్రమాలను సీఎం ప్రారంభించారు. వైకుంఠం క్యూ కాంప్లెక్స్-1 వద్ద ఏర్పాటు చేసిన పిలిగ్రిమ్స్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్, ఆధునీకరించిన ఎస్వీ మ్యూజియం, రిలయన్స్ ఫౌండేషన్, భారత్ బయోటెక్ సంస్థలు అందించిన 32 ఎలక్ట్రిక్ బస్సులను సీఎం జెండా ఊపి ప్రారంభించారు. వైకుంఠం క్యూ కాంప్లెక్స్ వద్ద ఏర్పాటు చేసిన పిలిగ్రిమ్స్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌లో శ్రీవారికి నిర్వహించే నిత్య కైంకర్యాలు, పూజా కార్యక్రమాలు, తిరుమలలోని వివిధ ప్రాంతాలను త్రీడీ సాంకేతికత ద్వారా భక్తులు వీక్షించే అవకాశం కల్పించారు. 6 డీవీఆర్ వర్చువల్ రియాలిటీ ద్వారా తిరుమల దర్శన అనుభూతిని ముఖ్యమంత్రి స్వయంగా పరిశీలించారు. మిగతా 3లో...

## కోవూరులో స్వర్గీయ ఎన్టీఆర్ కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి లోకేష్



**కోవూరు(జర్నలిస్ట్ ఫైల్):** నెల్లూరు జిల్లా పర్యటనలో భాగంగా కోవూరు బైపాస్ సాయిబాబా గుడి వద్ద ఏర్పాటుచేసిన స్వర్గీయ నందమూరి తారక రామారావు కాంస్య విగ్రహాన్ని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అంతకుముందు కోవూరు పట్టణానికి చేరుకున్న మంత్రి లోకేష్ కు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఘనస్వాగతం పలికారు. అనంతరం కోవూరు పట్టణం నుంచి బైపాస్ వరకు మంత్రి భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, రాజ్యసభ ఎంపీ బీద మస్తాన్ రావు, మంత్రి ఎన్ఎండీ ఫరూఖ్, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, నెల్లూరు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు బీద రవిచంద్ర యాదవ్, జోనల్ కోఆర్డినేటర్ మద్దిపాటి వెంకటరాజు తదితరులు పాల్గొన్నారు.

# అర్హుడికి రుణమే.. లక్ష్యం

**అమరావతి, సెప్టెంబర్ 16 (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలోని అన్ని రంగాలను, అన్ని వర్గాలను బలోపేతం చేసేలా బ్యాంకులు రుణాలు ఇవ్వాలని, ప్రతి అర్హుడికి బ్యాంకింగ్ సేవలు చేరాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బ్యాంకర్లకు దిశానిర్దేశం చేశారు. సచివాలయంలో బుధవారం జరిగిన 236వ ఎస్ఎల్‌బీసీ సమావేశంలో ముఖ్యమంత్రి పలు కీలక సూచనలు చేశారు. కొన్ని బ్యాంకులు రుణాలు ఇచ్చే విషయంలో చాలా వెనకబడి ఉన్నాయని, లక్ష్యాలను చేరుకుంటేనే ఎస్ఎల్‌బీసీ సమావేశానికి అర్థం ఉంటుందని సీఎం అన్నారు. వ్యవసాయ రుణాలు సహా వివిధ వర్గాలకు బ్యాంకులు అందించే సేవలపై సీఎం సమీక్షించారు. గత ఎస్ఎల్‌బీసీ సమావేశంలో ప్రస్తావించిన అంశాలపై ఏ మేరకు చర్యలు తీసుకున్నారని బ్యాంకర్లను అడిగి తెలుసుకున్నారు. మొత్తం 13 అంశాలకు గానూ 9 అంశాలపై చర్యలు తీసుకున్నామని బ్యాంకర్లు తెలిపారు. గత ఎస్ఎల్‌బీసీ సమావేశంలో ప్రస్తావనకు వచ్చిన అంశాలను, లక్ష్యాలను ఇంకా చేరుకోకపోవడం సరికాదని సీఎం అన్నారు. ఎంఎస్ఎంఈలకు రుణాల మొత్తం గతం కన్నా ఈసారి పెరిగినప్పటికీ ఆశించిన స్థాయిలో రుణాల మంజూరు జరగలేదన్నారు.




**కౌలు రైతులకు రుణాలపై దృష్టి పెట్టండి :** సమీక్షలో సీఎం మాట్లాడుతూ... 'పీఎం సూర్యఘర్‌లో దేశంలోనే ముందు స్థానంలో రాష్ట్రాన్ని నిలపాలని భావిస్తున్నాం... బ్యాంకులు పెద్దఎత్తున రుణాలు ఇస్తేనే ఇది సాధ్యమవుతుంది. రాష్ట్ర ఆర్థిక వృద్ధి 15 శాతం సాధించాలని లక్ష్యం పెట్టుకున్నప్పటికీ ఎల్‌నినో కారణంగా ఇబ్బందికర పరిస్థితి తలెత్తింది... ప్రతికూలతలు అధిగమించేందుకు కృషి చేస్తున్నాం. కౌలు రైతులకు రుణాలు సమృద్ధిగా అందించేలా బ్యాంకులు ముందుకు రావాలి. రుణాల చెల్లింపుల్లో స్వయం సహాయక సంఘాల మహిళలు ఆదర్శంగా నిలుస్తున్నారు...దేశంలోనే నెంబర్-1 స్థానంలో నిలిచారు. రుణాలు తీసుకున్న వారిలో 99 శాతానికి పైగా మహిళలు రుణాలను సమయానికే చెల్లించేస్తున్నారు... కేవలం 0.67 శాతం మంది మహిళలు మాత్రమే రుణాల చెల్లింపుల్లో వెనకబడ్డారు. వీరి నుంచి రుణాల 100 శాతం రికవరీ సాధించేందుకు వన్ టైమ్ సెటిల్మెంట్ విధానం గురించి బ్యాంకులు ఆలోచన చేయాలి. అలాగే, టిడ్కో గృహాలకు రుణాలు ఇచ్చేందుకు కార్యాచరణ త్వరితగతిన అమలులోకి తీసుకురావాలి... సైబర్ మోసాలపై అప్రమత్తత అవసరం. డీజీపీ సైబర్ సెక్యూరిటీ సెల్‌తో సమన్వయం జరగాలి. రాష్ట్రవ్యాప్తంగా సైబర్ ఫ్రాడ్-ఫైనాన్షియల్ లిటరసీ అవగాహన కార్యక్రమాలపై దృష్టి పెట్టాలి. నాలా చట్టం రద్దు చేసినందున... నాలా పేరుతో రుణాలు ఇవ్వకుండా ఎవరినీ ఇబ్బందులకు గురిచేయవద్దు.' అని చెప్పారు.

**236వ ఎస్ఎల్‌బీసీ సమావేశంలో ముఖ్యాంశాలు :** ఆంధ్రప్రదేశ్‌లో బ్యాంకింగ్‌లో రుణాల వేగం పెరిగింది. 2026 జూన్ నాటికి రూ.10.28 లక్షల కోట్లకు మొత్తం అడ్వాన్సులు చేరాయి. వ్యవసాయ రంగానికి భారీగా రుణ మద్దతు లభించింది. జూన్ 2026 నాటికి వ్యవసాయ రుణాలు రూ.3.98 లక్షల కోట్లుగా ఉన్నాయి. ఇది గతేడాది కన్నా ఎక్కువ. అటు ఎంఎస్ఎంఈలకు సంబంధించి 2026-27 ఆర్థిక సంవత్సరం జూన్ వరకు తొలి త్రైమాసికంలో 2.33 లక్షల ఎంఎస్ఎంఈలకు రూ.63,686 కోట్ల రుణాల పంపిణీ జరిగింది. అటు పీఎం సూర్య ఘర్‌కు సెప్టెంబర్ 10 నాటికి 1,57,703 దరఖాస్తులు రాగా రూ.3,081 కోట్ల రుణాల మంజూరు చేశారు. మహిళా స్వయం సహాయక సంఘాల రుణాలపై అన్ని బ్యాంకుల్లో సర్వీస్ ఛార్జీల నుంచి పూర్తి స్థాయి మినహాయింపు ఇచ్చాయి. ఎస్‌హెచ్‌జీలకు సెప్టెంబర్ 10 నాటికి మొత్తం రూ.18,621 కోట్ల రుణాల పంపిణీ జరిగింది. పీఎం ముద్ర రుణాల్లో భారీ పురోగతి కనిపించింది. సెప్టెంబర్ 10 నాటికి 4,48,562 దరఖాస్తులకు రూ.13,757 కోట్ల రుణాలను బ్యాంకులు మంజూరు చేశాయి. మరోవైపు సమీక్షలో రాజధాని అమరావతి ఫైనాన్సియల్ హబ్‌లో పలు బ్యాంక్ కార్యాలయాల నిర్మాణాల పురోగతిని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. మరింత వేగంగా నిర్మాణాలు పూర్తిచేయడంపై బ్యాంకులు దృష్టి పెట్టాలని ఈ సందర్భంగా సీఎం సూచించారు. అలాగే ఇకపై ఎస్ఎల్‌బీసీ సమావేశాలను...బ్యాంకులు, జిల్లాలు, విభాగాల వారీగా ఫలితాలు విశ్లేషించిన తర్వాతే దానిపై సమీక్షించాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. ఈ సమావేశంలో మంత్రులు పయ్యావుల కేశవ్, అచ్చెన్నాయుడు, కొండపల్లి శ్రీనివాస్, బ్యాంకింగ్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## అల్ట్రా మెగా ప్రాజెక్టుగా బీపీసీఎల్ రిఫైనరీ



(మొదటి పేజీ తరువాయి)

**పెట్రో కెమికల్ పార్కు ఏర్పాటుపై సూచన :** ప్రాజెక్టులో భాగంగా రిఫైనరీ నుంచి యూరో-6 ప్రమాణాలతో కూడిన ఇంధనం ఉత్పత్తి అవుతుందని బీపీసీఎల్ సీఎండీ ముఖ్యమంత్రికి వివరించారు. మోటార్ స్పిరిట్ , హైస్పీడ్ డీజిల్, ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ కలిపి సుమారు 5.4 మిలియన్ టన్నులు ఉత్పత్తి కానున్నట్టు తెలియచేశారు. ఇతర పెట్రోకెమికల్స్ ఉత్పత్తులు సుమారుగా 3.2 మిలియన్ టన్నులు ఉంటుందన్నారు. ఉప ఉత్పత్తులుగా హెచ్‌డీపీఈ, ఎల్‌డీపీఈ, ఎల్ఎల్‌డీపీఈ, పాలీప్రొపైలీన్, పాలీ వినైల్ క్లోరైడ్ వంటి బై ప్రోడక్ట్స్ కూడా వస్తాయని వివరించారు. బీపీసీఎల్ రిఫైనరీ నిర్మాణం కోసం అవసరమైన 6 వేల ఎకరాల భూమిలో 75 శాతాన్ని ఇప్పటికే అప్పగించామని ముఖ్యమంత్రి తెలిపారు. మిగిలిన భూమిని అక్టోబరు రెండో వారంలోగా అప్పగిస్తామన్నారు. ప్రాజెక్టుకు సంబంధించిన ప్రక్రియలను వేగవంతం చేసి వీలైనంత త్వరగా పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు బీపీసీఎల్ ప్రతినిధులను కోరారు. రిఫైనరీ సమీపంలో సుమారు 1,500 ఎకరాల్లో డౌన్‌స్ట్రీమ్ పెట్రోకెమికల్స్ పార్క్ ఏర్పాటుకు బీపీసీఎల్, ఏపీఐఐసీ కలిసి ప్రణాళిక రూపొందించాలని సీఎం సూచించారు.

**భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఉత్పత్తులు :** భారత్‌లో పట్టణీకరణ, తయారీ రంగం విస్తరణతో పెట్రోకెమికల్స్ కు డిమాండ్ వేగంగా మారుతోందని సీఎం వివరించారు. దేశ పెట్రోకెమికల్ ఇంటెన్సిటీ ఇండెక్స్ ప్రస్తుతం 5 శాతం నుంచి వచ్చే దశాబ్దంలో 15-20 శాతానికి పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని రిఫైనరీని నిర్మించాల్సిన అవసరం ఉందని సీఎం అభిప్రాయం వ్యక్తం చేశారు. ముడి చమురును కేవలం ఇంధనంగా వినియోగించకుండా ఇథిలీన్, ప్రొపైలీన్ వంటి రసాయన ముడి పదార్థాల ఉత్పత్తిని పెంచే విధంగా ఆధునిక రిఫైనరీల రూపకల్పన జరగాలని సీఎం సూచించారు. ప్రాథమిక పాలిమర్లకే పరిమితం కాకుండా అధునాతన మెటీరియల్ విభాగాల్లో పెరుగుతున్న డిమాండ్‌ను కూడా పరిగణనలోకి తీసుకోవాలని తెలిపారు. దేశంలో కెమికల్, పెట్రోకెమికల్ రంగం 2040 నాటికి 1 ట్రిలియన్ డాలర్లకు చేరుతుందని, ఆ అవసరాలను తీర్చే దిశగా బీపీసీఎల్ పనిచేస్తుందని సీఎండీ సంజయ్ ఖన్నా తెలిపారు. సమావేశంలో బీపీసీఎల్ డైరెక్టర్ ఫైనాన్స్ వీఆర్‌కే గుప్తా, ఏపీ రిఫైనరీ ఈడీ రాజీవ్, జీఎం రిటైల్ టి. చతుర్వేది, పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్ ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఖాకీ కొలువులకు.. భారీ నోటిఫికేషన్

(మొదటి పేజీ తరువాయి)

పోలీసు కమ్యూనికేషన్ విభాగంలో 200 కానిస్టేబుల్ పోస్టులకు నోటిఫికేషన్ వెలువడింది. పీటీవో విభాగంలో 15 మెకానిక్, 198 డ్రైవర్ పోస్టులను భర్తీ చేయనున్నారు.

సైంటిఫిక్ అసిస్టెంట్ విభాగంలో 43 పోస్టులు ఉన్నాయి. వీటిలో ఫిజిక్స్ 10, కెమిస్ట్రీ 13, బయాలజీకి సంబంధించిన 20 పోస్టులు ఉన్నాయి. వివిధ కేటగిరీల్లో ఖాళీల భర్తీకి సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేసిన అధికారులు, రాత పరీక్షల తేదీలను త్వరలో వెల్లడించనున్నారు. ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న అభ్యర్థులు అధికారిక నోటిఫికేషన్‌లో అర్హతలు, వయోపరిమితి, దరఖాస్తు విధానం, పరీక్షా విధానం తదితర వివరాలను పరిశీలించాల్సి ఉంటుంది.

## మహిళా క్రికెటర్లకు వేదికగా 'విమెన్ ఏపీఎల్'

(మొదటి పేజీ తరువాయి)

మహిళా క్రికెటర్లలో ప్రతిభను వెలికితీయడం, క్రీడల్లో మహిళల భాగస్వామ్యాన్ని పెంచడం, మహిళా సాధికారతను ప్రోత్సహించడమే విమెన్ ఏపీఎల్ ప్రధాన ఉద్దేశమని కేశినేని శివనాథ్ తెలిపారు. టోర్నీ ప్రారంభోత్సవ కార్యక్రమానికి నారా బ్రాహ్మణి ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు వెల్లడించారు. మ్యాచ్‌లను వీక్షించేందుకు ప్రేక్షకులకు ఉచిత ప్రవేశం కల్పిస్తున్నామని తెలిపారు. క్రీడలపై ఆసక్తి ఉన్న విద్యార్థులను ప్రోత్సహించేందుకు విజయవాడ నుంచి మంగళగిరి స్టేడియం వరకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని మహిళా క్రికెట్ ప్రతిభకు ఈ లీగ్ మంచి వేదికగా నిలుస్తుందని కేశినేని శివనాథ్ పేర్కొన్నారు. తొలి సీజన్‌లో అన్ని మ్యాచ్‌లను మంగళగిరిలో నిర్వహిస్తామని, వచ్చే సీజన్ నుంచి విశాఖపట్నం, కడప స్టేడియాల్లోనూ మ్యాచ్‌లు నిర్వహించేలా ప్రణాళిక రూపొందిస్తున్నామని తెలిపారు. మహిళా ఏపీఎల్‌పై క్రీడాభిమానులు, ప్రజల్లో అవగాహన కల్పించేందుకు గురువారం సాయంత్రం విజయవాడ నుంచి మంగళగిరి వరకు సైకిల్ ర్యాలీ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. మహిళా క్రికెట్‌కు ప్రోత్సాహం అందించడంతో పాటు రాష్ట్రంలో క్రీడా సంస్కృతిని మరింత విస్తరించేందుకు విమెన్ ఏపీఎల్ దోహదపడుతుందని ఆయన తెలిపారు.

# ప్రతి దశలోనూ.. రోగి భద్రత

(మొదటి పేజీ తరువాయి)

**'సంజీవని'తో నిరంతర వైద్యం :** పరీక్షల్లో వ్యాధి ఉన్నట్లు తేలిన తర్వాత రోగికి తదుపరి వైద్యం అందడంలో ఎలాంటి అంతరాయం ఉండకూడదన్నారు. 'సంజీవని' ద్వారా పరీక్షలు, చికిత్స, మందులు, తదుపరి పర్యవేక్షణ వంటి సేవలను అనుసంధానం చేస్తున్నామని మంత్రి తెలిపారు. ముఖ్యంగా దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు క్రమం తప్పకుండా వైద్యం పొందేలా సేవలను కొనసాగించాలని సూచించారు. ప్రతి రోగి ఆరోగ్య వివరాలను డిజిటలీకరణ చేస్తున్నామని తెలిపారు. సంజీవని ద్వారా రోగులకు ఆరోగ్య భద్రత మరింత పెరుగుతుందని చెప్పారు.



**మందుల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ :** రోగికి అవసరమైన మందులు సరైన మోతాదులో, సరైన సమయంలో అందడం చికిత్సలో కీలకమన్నారు. వైద్యుల సూచనల మేరకు మందులు తీసుకునేలా రోగులకు అవగాహన కల్పించాలని మంత్రి సూచించారు. రోగులు తాము గతంలో తీసుకున్న చికిత్స, ప్రస్తుతం వాడుతున్న మందుల వివరాలను వైద్యులకు స్పష్టంగా తెలియజేయాలని, సొంతంగా మందుల మోతాదును మార్చడం లేదా నిలిపివేయడం చేయకూడదని తెలిపారు.

**రోగి - కుటుంబం భాగస్వామ్యం :** రోగి భద్రతలో రోగి, కుటుంబ సభ్యుల భాగస్వామ్యం కూడా ముఖ్యమన్నారు. రోగులు తమ ఆరోగ్య సమస్యలను వైద్యులకు స్పష్టంగా తెలియజేయాలని సూచించారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి కుటుంబ సభ్యులు అండగా నిలవాలని తెలిపారు. మందులు సకాలంలో తీసుకోవడం, అవసరమైన పరీక్షలు చేయించుకోవడం, వైద్యుల సూచనలు పాటించడంలో సహకరించాలని మంత్రి సూచించారు.

**ఆస్పత్రుల్లో భద్రతా ప్రమాణాల పరిశీలన :** ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగి భద్రతకు సంబంధించిన విధానాలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. చికిత్స సమయంలో ఎదురయ్యే సమస్యలను గుర్తించి వెంటనే సరిదిద్దాలని సూచించారు. రోగి వివరాల నమోదు, మందుల భద్రత, చికిత్స విధానాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యులు, నర్సులు, ఇతర ఆరోగ్య సిబ్బందికి అవగాహన కల్పించాలన్నారు. మంచి విధానాలను గుర్తించి అన్ని ఆస్పత్రుల్లో అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని మంత్రి తెలిపారు.

**అవగాహన కార్యక్రమాలు :** ప్రపంచ రోగి భద్రతా దినోత్సవం సందర్భంగా అన్ని జిల్లాలు, బోధనాస్పత్రుల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. వైద్యులు, నర్సులు, ఇతర ఆరోగ్య సిబ్బందికి రోగి భద్రత, మందుల భద్రత, సురక్షిత వైద్య విధానాలపై అవగాహన కల్పించాలని మంత్రి శ్రీ సత్య కుమార్ సూచించారు.

### హజ్ యాత్రకు..
## వైద్య పరీక్షలు తప్పనిసరి

(మొదటి పేజీ తరువాయి)



ఇప్పటివరకు వైద్య పరీక్షలను పూర్తి చేయని యాత్రికులు పొడిగించిన గడువులోగా వైద్య పరీక్షలు పూర్తి చేసుకోవాలని మంత్రి సూచించారు. ఎన్ఆర్ఐ యాత్రికులు తమ ప్రస్తుత నివాస దేశంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో వైద్య పరీక్షలు చేయించు కోవచ్చని పేర్కొన్నారు.

వైద్య పరీక్షలు పూర్తయిన అనంతరం ప్రాథమిక వైద్య పరీక్ష, శారీరక దృఢత్వ ధ్రువీకరణ సర్టిఫికెట్ తోపాటు ఆన్లైన్లో చెల్లింపు మొత్తానికి సంబంధించిన రసీదును అక్టోబర్ 1వ తేదీలోపు హజ్ కమిటీ ఆఫ్ ఇండియా పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు. ఇవే రసీదులను,ధ్రువపత్రాలను రాష్ట్ర హజ్ కమిటీలకు సమర్పించడం తప్పనిసరి అని మంత్రి వెల్లడించారు. యాత్రికులు తమ ఒరిజినల్ ప్రాథమిక వైద్య పరీక్ష, శారీరక దృఢత్వ ధ్రువీకరణ సర్టిఫికెట్, సంబంధిత వైద్య పరీక్షల నివేదికలను భద్రంగా ఉంచుకోవాలని మంత్రి తెలిపారు.హజ్ యాత్రకు ముందు జరిగే స్టేజ్-2 వైద్య పరీక్షలు, వ్యాక్సినేషన్ సమయంలో వాటిని సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. హజ్-2027 యాత్రికులకు అవసరమైన వైద్య పరీక్షలు సకాలంలో పూర్తయ్యేలా సంబంధిత అధికారులు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, జిల్లా హజ్ సొసైటీ ఌ రాష్ట్ర హజ్ కమిటీలు సమన్వయంతో పూర్తి చేయాలని మంత్రి ఫరూక్ ఆదేశించారు.

# కూటమికి.. వన్‌సైడ్ విక్టరీ!

(మొదటి పేజీ తరువాయి)

ఆశ్చర్యమేసింది. ప్రతిదీ చంద్రబాబు, లోకేష్ చూసుకోవడం సాధ్యం కాదు. మనకు వారి మాదిరి దొంగ పేపర్లు, టివిలు లేవు. అయితే కోటిమంది కార్యకర్తలు ఉన్నారు. మనమంతా మాట్లాడటం మొదలు పెడితే వారు ఎన్నిరాసినా ప్రజలు నమ్మరు.

**చేసిన మంచితోపాటు గొడ్డలి పార్టీ కుట్రలను తెలియజేయండి :** భారతదేశంలో ఎవరూ ఇవ్వని విధంగా పెన్షన్లు ఇస్తున్నాం. ఇంట్లో ఎంతమంది చదువుకునే పిల్లలు ఉంటే అందరికీ తల్లికి వందనం ఇస్తున్నాం, స్త్రీశక్తి కింద ఉచిత బస్సు కల్పిస్తున్నాం. రైతులకు అన్నదాత సుఖీభవ, చేనేతల సేవలో, ఆటోవాలా సేవలో, మత్స్యకారుల సేవలో వంటి పథకాలు అమలు చేస్తున్నాం. 16వేల టీచర్ పోస్టులు, 6వేల కానిస్టేబుల్ పోస్టులు భర్తీచేసిన ఘనత కూటమి ప్రభుత్వానిది. గూగుల్, రాయల్ ఎన్ ఫీల్డ్ వంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టులను రాష్ట్రానికి రప్పించాం. అభివృద్ధి, సంక్షేమం జోడెడ్ల బండిలాంటివి. వాటిని సమర్థమంతంగా ముందుకు తీసుకెళ్తున్నాం. వైసిపి హయాంలో రోడ్లపై పడిన గుంతలు పూడ్చడానికి 2వేల కోట్లు ఖర్చయ్యాయి. ప్రజాప్రభుత్వం గత రెండేళ్లలో చేసిన మంచిపనులతోపాటు గొడ్డలిపార్టీ కుట్రలను ప్రజలకు తెలియజెప్పాల్సిన బాధ్యత కేడర్ పై ఉంది.

**వేమిరెడ్డి దంపతులకు అభినందనలు :** నెల్లూరుగడ్డపై ఎంతో గొప్పవాళ్లు జన్మించారు. ప్రపంచంలో ఎక్కడికెళ్లినా నెల్లూరు వాళ్లు ఉంటారు. స్వాతంత్ర్య సమరయోధుడు బెజవాడ గోపాలరెడ్డి జన్మించిన నేల కోవూరు. ఎన్టీఆర్ పార్టీని స్థాపించినపుడు కోవూరుకు చెందిన బెజవాడ పాపిరెడ్డి తొలి కార్యకర్తగా చేరారు. ఎంతో గొప్ప చరిత్ర ఉన్న నేల ఇది. కోవూరులో అన్నగారి విగ్రహంలేని లోటు తీర్చిన వేమిరెడ్డి దంపతులకు అభినందనలు. కోవూరు టిడిపి కంచుకోట. కొందరు మనపార్టీలో గెలిచి వేరే పార్టీలోకి వెళ్లారు. అయినా ఎత్తిన పసుపుజెండా దించని కార్యకర్తలు అండగా నిలబడ్డారు. ఈ నియోజకవర్గంలో 8 సార్లు మనం గెలిచాం. విపిఆర్ తాగునీటి సమస్య పరిష్కారానికి స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సేవలు చేస్తున్నారు. ప్రజలకోసం ఏదో చేయాలనే తపన ఆయనలో ఉంది. ఎంతోమంది డబ్బు సంపాదించినా అటువంటి ఆలోచన రావడం అభినందనీయం.

**డిఎస్సీ అంటే జగన్‌కు డ్రగ్స్, శాండ్, చీప్ లిక్కర్ గుర్తొస్తాయి! :** డిఎస్సీకి, ఎపిపిఎస్సీ కి తేడా తెలియని వ్యక్తి నన్ను ప్రశ్నిస్తున్నారు. దేశ చరిత్రలో అనేక మంది సిఎంలను చూశా, గత అయిదేళ్లలో సైకోని చూశా. గొడ్డలిపార్టీ అధినేతకు డిఎస్సీ అంటే డ్రగ్స్, శాండ్, చీప్ లిక్కర్ గుర్తొస్తాయి. వారు అధికారంలో ఉన్న సమయంలో ఒక్క టీచర్ పోస్టు ఇవ్వలేదు. మనం 16వేల టీచర్ పోస్టులను ఇస్తే ప్రశ్నిస్తున్నారు. డిఎస్సీపై తప్పుడు ఆరోపణలతో సిబిఐ ఎంక్వయిరీకి ఆదేశించాలని హైకోర్టులో వాళ్లు పిటిషన్ వేయగా, కోర్టు మొట్టికాయలు వేయడంతో పిల్ వేస్తే విత్ డ్రా చేసుకున్నారు. ఏ తప్పు చేయని చంద్రబాబును



53రోజులు జైలులో పెడితే సింహంలా తిరిగి వచ్చారు. ఆయన ఎప్పుడు భయపడలేదు. నేను మళ్లీ చాలెంజ్ చేస్తున్నాను. డిఎస్సీపై చర్చకు నేను, సిద్ధం, జగన్ సిద్ధమా... అరిగిపోయిన రికార్డులా డిఎస్సీలో అవకతవకలు అంటూ లేనిపోని విమర్శలు చేస్తున్నారు. ఎటువంటి తప్పు జరగకపోయినా ప్రజలను నమ్మించేలా వాళ్లు అబద్ధాలు చెబుతున్నారు. మనం నిజాన్ని ఎక్కువ సార్లు ప్రజలకు చెప్పాలి. ఇటీవల 10వేల టీచర్, పోలీసు, ఇతర పోస్టులతో నోటిఫికేషన్ ఇచ్చాం. అదీ మన చిత్తశుద్ధి.

**కులం ముసుగులో వస్తున్నారు...తస్మాత్ జాగ్రత్త! :** వైసిపి నాయకులు కులం ముసుగులో జనంలోకి వస్తున్నారు. సీదిరి అప్పలరాజు కొడుకు యాక్సిడెంట్ చేసి ఒక వ్యక్తిని చంపేస్తే మరొకరిని తీసుకొచ్చి కేసు మాఫీ చేసుకోవాలని చూశాడు. జగన్ చనిపోయిన బిసి కుటుంబం పరామర్శకు వెళ్లకుండా అప్పలరాజు ఇంటికి వెళ్లాడు. జగన్ బడా చోర్ అయితే, కారుమూరు నాగేశ్వరరావు చోటా చోర్. మద్యంలో 400 కోట్లు దోచేసి, కోడలు ఎకౌంట్ లో వేసి బుక్ చేశాడు. ఇన్‌కం టాక్స్, ఈడి వాళ్లు వచ్చి బొక్కలో వేశారు. ఆ వ్యవహారంలో మనకు సంబంధం లేదు. అయినా మనపై తోస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో అమర్ నాథ్ గౌడ్, నందం సుబ్బయ్యలను ఎలా చంపారో చూశాం. గొడ్డలిపార్టీ మారణకాండపై బిసిల్లో చైతన్యం తేవాలి. అయిదేళ్ల అరాచకాలను ప్రజలకు చెప్పాల్సిన బాధ్యత ఉంది. సంక్షేమం, అభివృద్ధితోపాటు గొడ్డలిపార్టీ దుష్ప్రచారాన్ని కూడా ప్రజల్లోకి తీసుకెళ్లాలి.

**మరోసారి ఆమె గురించి తప్పుగా మాట్లాడితే సహించం! :** ప్రజల కోసం ప్రశాంతిరెడ్డి రాజకీయాల్లోకి వచ్చారు. వారిది గౌరవంగా బతికే కుటుంబం, ఏనాడు తప్పు చేయలేదు. కొంతమంది రౌడీలు, నియోజకవర్గానికి ఒక్కపని చేయని వారు ఆమె గురించి మాట్లాడుతున్నారు. త్వరలో మీ టైం కూడా వస్తుంది, ఎవరినీ వదలిపెట్టం. నీతి,నిజాయితీగా ప్రజలకోసం రాజకీయాల్లోకి వచ్చిన విపిఆర్ కుటుంబం గురించి, వారి క్యారెక్టర్ గురించి మాట్లాడే హక్కు వైసిపి నాయకులకు ఎవరిచ్చారు. మరోసారి అటువంటి మాటలు మాట్లాడితే వారి సంగతి చూస్తా. అసెంబ్లీలో సైకోలు చేసిన వ్యక్తిత్వ హనన వ్యాఖ్యల వల్ల నాతల్లి మూడునెలలు బాధపడింది. ఏనాడు నేను జగన్ తల్లి విజయలక్ష్మి, చెల్లి షర్మిల గురించి మాట్లాడలేదు. ఆయన భార్య భారతి గురించి ఓ కార్యకర్త మాట్లాడితే జైలుకు పంపించాం. పార్టీ ఏదైనా రాజకీయం వేరు, కుటుంబం వేరుగా చూడాల్సిన అవసరం ఉంది. బుల్లెట్ దిగిందా, గెలవకపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటా అన్న వ్యక్తి ఇప్పుడు ఏమయ్యాడో చూశాం. ఈరోజు అతడి పరిస్థితి ఏమిటి, బాబుగారి జోలికి ఎవరు వచ్చినా మాడి మసైపోయారు.

**కార్యకర్తే అధినేత నినాదాన్ని చేతల్లో చూపుతున్నాం:** కార్యకర్తే అధినేత అనే నినాదాన్ని చేతల్లో చూపుతున్నాం. పార్టీ ఆవిర్భావ దినోత్సవం రోజున అధ్యక్షుల వారి పక్కన సాధారణ కార్యకర్తలు కూర్చున్నారు. కడప మహానాడులో మనం చేసుకున్న ఆరు శాసనాల్లో ఒకటి కార్యకర్తే అధినేత. పసుపు సైన్యం త్యాగం, రక్తం వల్లే మనకు అధికారం దక్కింది. పల్నాడులో తోట చంద్రయ్య గొంతుపై కత్తిపెట్టి వారి పార్టీకి జైకొట్టమంటే జై టిడిపి, జై చంద్రబాబు అని ప్రాణాలు వదిలారు. ఆయనే నాకు స్ఫూర్తి, ఆయన కుమారుడికి ఉద్యోగం ఇచ్చేందుకు చట్టాన్ని సవరించాం. చంద్రయ్య కుమారుడికి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చిన ఘనత టిడిపిది. మంజుల, అంజిరెడ్డి తాత ధైర్యాన్ని చూశాం. మనది ఒక పెద్ద కుటుంబం. కార్యకర్తల కోసం సంక్షేమ నిధి, ఇప్పటివరకు రూ.175 కోట్లు అందించాం. కార్యకర్తలు ఆర్థికంగా నిలదొక్కుకోవాలన్నదే మా లక్ష్యం. ప్రతి కార్యకర్త సొంత కాళ్లపై నిలబడాలన్నది బాబు గారి ధ్యేయం. కార్యకర్తల ఆర్థిక స్వావలంబన, ఆరోగ్యం ముఖ్యం. మన ఆరోగ్యం బాగుంటే కుటుంబం, పార్టీ బాగుంటాయి. పార్టీ కార్యాలయంలో రక్తపరీక్షలు చేయించుకోండి. ఉచితంగా మందులు కూడా అందించే బాధ్యత నాది. మైటిడిపి, మై హెల్త్ యాప్ లు తెచ్చాం. ఆ కార్యక్రమానికి సహకరించండి.

**నా తెలుగుదేశం - నా బాధ్యత నినాదానికి కట్టుబడి ఉండండి :** కార్యకర్తలంతా నా తెలుగుదేశం, నా బాధ్యత అనే నినాదానికి కట్టుబడి ఉండాలి. జిల్లా నుంచి పార్లమెంటు వ్యవస్థ తేవడానికి మూడు పొలిట్ బ్యూరో సమావేశాలు పట్టింది. పార్టీలో మార్పు రావాలి, యువరక్తం రావాలని పోరాడా. మనది కోటి 6లక్షల సభ్యులున్న అతిపెద్ద కుటుంబం. చిన్నచిన్న సమస్యలు ఉంటే అంతర్గతంగా మాట్లాడుకుందాం. ఏదేని అంశంపై పార్టీ నిర్ణయం తీసుకున్నాక జై తెలుగుదేశం, జై చంద్రబాబు అనాలి. పాదయాత్ర చేసినపుడు కార్యకర్తలు కలిశారు. పనిచేసిన వారికి గుర్తింపు ఇవ్వాలన్నారు. అందుకే మై టిడిపి యాప్ తెచ్చాం. పార్టీ పిలుపు ఇచ్చిన కార్యక్రమాలు చేసిన నామినేటెడ్ పోస్టులు వెదుక్కుంటూ వస్తాయి. ప్రతి వ్యక్తి యాక్టివిటీని చంద్రబాబు చూస్తున్నారు. ఇంటింటికీ టిడిపి కార్యక్రమంలో 45రోజుల్లో కోటి 10లక్షల గడపలు కార్యకర్తలు తొక్కారు. ఒకరోజు 47వేలమంది పాల్గొన్నారు. అదే మనందరికీ శ్రీరామరక్ష. కార్యకర్తలు నాయకుల చుట్టూ కాదు, ప్రజల చుట్టూ తిరగండి. మిమ్మల్ని గుర్తించే బాధ్యత నాది.

**కేడర్ అంతా ప్రజలతో మమేకం కావాలి :** కార్యకర్తలు ప్రజల వద్దకు వెళ్లి, వారితో మమేకం కావాలి. వారితో అనుబంధం చాలా ముఖ్యం. ప్రజలతో బంధం ఏర్పడటం వల్లే మంగళగిరి ప్రజలు నన్ను 91వేల మెజారిటీతో గెలిపించారు. కార్యకర్తలంతా ప్రజలతో అనుసంధానం అవ్వండి. ప్రజలకు దగ్గర కావాల్సిన అవసరం ఉంది. క్లస్టర్, యూనిట్ పనిచేయకపోతే దండం పెట్టి మార్చుకుంటాం. డోర్ టు డోర్ కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా 8వేల బూత్ లలో ఇన్చార్జిలు తిరగలేదు. 75ఏళ్ల వయసులో బాబు గారు తిరుగుతుంటే మనం వెళ్లకపోతే ఎలా? పార్టీ కార్యకర్తలంతా సీరియస్ గా తీసుకొని పనిచేయండి. ఏ కార్యక్రమం చేసినా మన టిడిపి యాప్ ద్వారా తెలియజేయండి. కోటి 6లక్షలకు తోడు మనకు జనసేన, బిజెపి కూడా ఉన్నాయి. నోక్రాస్ ఫైర్, మిస్ ఫైర్, విడాకులు ఉండవు. పార్టీ అధినేతలుగా మాకు ఎలాంటి డౌట్లు లేవు. డౌట్ వస్తే నేను పవనన్నకు నేరుగా ఫోన్ చేస్తా. చిన్నచిన్న సమస్యలుంటే కూర్చుని మాట్లాడుకొని పరిష్కరించుకోవాలి.

**ప్రభుత్వ కొనసాగింపు ముఖ్యం :** ప్రభుత్వ కొనసాగింపు వల్ల గుజరాత్, ఒడిశా రాష్ట్రాలు అభివృద్ధి చెందాయి. అయిదేళ్లు ప్రభుత్వం మారడం వల్ల ఇబ్బంది పడ్డాం. జైలుకు వెళ్లాం. కష్టకాలాన్ని మర్చిపోకూడదు. 2019-24వరకు దొంగ కేసులు పెట్టారు. నాపై 23 కేసులు పెట్టారు. కేసులపై అప్రమత్తంగా ఉండాలి. భైరెడ్డి శబరి నేతృత్వంలో కమిటీ వేశాం, రివ్యూ చేసి దొంగ కేసులు తీసేస్తున్నాం. ఎవరిపైనైనా తప్పుడు కేసులు ఉంటే పార్టీ ఆఫీసుకు తెలియజేయండి. ఉపాధి హామీ, నీరు చెట్టు, ఇతర బిల్లులు క్లియర్ చేశాం. 200 కోట్లు పెండింగ్ ఉంది. అది కూడా క్లియర్ చేస్తాం. 2029 నాటికి పెండింగ్ ఉన్నాయంటే ఒప్పుకోను. కోవూరులో అద్భుతమైన నాయకత్వం ఉంది. వారికి అండగా నిలబడాలి. నియోజకవర్గాన్ని కంచుకోటగా తయారు చేయాలి. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా తెలుగుదేశం జెండా ఎగరాలని మంత్రి లోకేష్ పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో నెల్లూరు ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్ రావు, రాష్ట్ర మంత్రి ఎన్ఎండి ఫరూక్, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, జోనల్ కోఆర్డినేటర్ మద్దిపాటి వెంకట్రాజు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, పార్లమెంటు పార్టీ ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వరరెడ్డి, కోవూరు నియోజకవర్గ అబ్జర్వర్ ఐనంపూడి రమేష్ పాల్గొన్నారు.

# 'సేవా సంకల్ప్ అభియాన్'తో రాష్ట్రవ్యాప్తంగా వైద్య శిబిరాలు

- అక్టోబరు 17 వరకు నిర్వహణ
- కేంద్ర, రాష్ట్ర ఆరోగ్య పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి
- అధికారులకు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశాలు




**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని 'సేవా సంకల్ప్ అభియాన్'లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా గురువారం నుంచి అక్టోబరు 17 వరకు నెల రోజుల పాటు వైద్య శిబిరాలు నిర్వహించనున్నారు. ఈ శిబిరాల్లో ప్రజలకు అవసరమైన వైద్య సేవలు అందించడంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఆరోగ్య పథకాలు, కార్యక్రమాలపై అవగాహన కల్పించనున్నారు. 'వికసిత్ భారత్-స్వర్ణ ఆంధ్రప్రదేశ్-2047' లక్ష్యాలకు అనుగుణంగా కార్యక్రమాలను చేపడుతున్నామని భాజపా జాతీయ నాయకుడు, రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా ఈ వైద్య శిబిరాలు జరగనున్నాయి.

**వైద్య సేవలతో పాటు పథకాలపై అవగాహన :** రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో వైద్య శిబిరాలను నిర్వహించనున్నారు. ప్రజలకు అవసరమైన వైద్య పరీక్షలు, చికిత్స అందించడంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆరోగ్య పథకాల వివరాలను తెలియజేయనున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ఆరోగ్య పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను మంత్రి ఆదేశించారు. పార్టీ అధిష్టానం ఆదేశాలు అనుసరించి సేవా సంకల్ప అభియాన్ ద్వారా
దక్షిణాదిన జరిగే కార్యకలాపాలను భాజపా తరపున మంత్రి సత్య కుమార్ పర్యవేక్షిస్తున్నారు.

**ప్రత్యేక కమిటీ ఏర్పాటు:** వైద్య శిబిరాల నిర్వహణకు రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ డాక్టర్ చక్రధర్‌బాబు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. శిబిరాల ప్రణాళిక, సమన్వయం, అమలు, పర్యవేక్షణ బాధ్యతలను ఈ కమిటీ చేపట్టనుంది. జిల్లా వారీగా శిబిరాల తేదీలు, ప్రాంతాలు, చేపట్టాల్సిన కార్యక్రమాలు, అందించాల్సిన వైద్య సేవలను ఖరారు చేయనుంది. శిబిరాలకు హాజరయ్యే వారి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నారు. అందించిన వైద్య సేవలు, రోగుల వివరాలను కమిటీ పర్యవేక్షించనుంది. అవసరమైన చోట అధికారులకు సలహాలు, సూచనలు అందించనుంది. శిబిరాలు పూర్తయిన అనంతరం జిల్లాల వారీగా నిర్వహించిన కార్యక్రమాలు, లబ్ధిదారుల వివరాలతో సమగ్ర నివేదిక రూపొందించనున్నారు.

మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ "'సేవా సంకల్ప్ అభియాన్' ద్వారా ప్రజలకు అవసరమైన వైద్య సేవలను మరింత చేరువ చేయాలి. ప్రతి జిల్లాలో అధికారులు సమన్వయంతో పనిచేసి శిబిరాలను విజయవంతం చేయాలి. కేంద్ర, రాష్ట్ర ఆరోగ్య పథకాల సమాచారం ప్రజలకు చేరేలా చర్యలు తీసుకోవాలి. అర్హులైన ప్రతి ఒక్కరికీ శిబిరాల ప్రయోజనం అందేలా చూడాలి" అని అధికారులకు మంత్రి దిశానిర్దేశం చేశారు. కమిటీకి డాక్టర్ బి.వి. సతీష్‌కుమార్ (సంయుక్త సంచాలకులు) సమన్వయ అధికారిగా వ్యవహరిస్తారు. ఉన్నతాధికారులు కె. శ్యామల, డాక్టర్ టి. రమేష్, డాక్టర్ జె. నరసింహ నాయక్, డాక్టర్ వి.వి.బి. సుబ్రహ్మణ్యం సభ్యులుగా ఉంటారు. ఈ మేరకు రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ డాక్టర్ చక్రధర్‌బాబు జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

**జిల్లా వైద్యాధికారులతో కమిషనర్ సమీక్ష :** రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న వైద్య శిబిరాల నిర్వహణపైకుటుంబ సంక్షేమ కమిషనర్ చక్రధర్‌బాబు బుధవారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారులతో సమీక్ష జరిపారు. నెల రోజుల పాటు శిబిరాల నిర్వహణకు తీసుకోవాల్సిన చర్యలు, వైద్య సేవల అందజేత, ప్రజలకు అవగాహన కల్పించడం, ముందస్తు ప్రచారం, శిబిరాలకు ప్రజలను సమీకరించడం తదితర అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. శిబిరాలకు వచ్చే ప్రతి ఒక్కరికీ అవసరమైన పరీక్షలు నిర్వహించి, వ్యాధి ఉన్నట్లు గుర్తించిన వారికి తదుపరి వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. శిబిరాల్లో అందించే సేవలు, లబ్ధిదారుల వివరాలను సక్రమంగా నమోదు చేసి, కార్యక్రమం పూర్తయ్యే వరకు పర్యవేక్షించాలని అధికారులకు తెలిపారు. 104 సంచార వైద్యశాల ద్వారా గ్రామాల్లో జరిగే వైద్య పరీక్షలతో అనుసంధానం జరగాలని చక్రధర్ బాబు అధికారులకు స్పష్టం చేశారు.

వైద్య శిబిరాల నిర్వహణపై మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రత్యేక దృష్టి సారించారని చక్రధర్‌బాబు తెలిపారు. ప్రజలకు వైద్య సేవలు అందించడంతో పాటు కేంద్ర, రాష్ట్ర ఆరోగ్య పథకాల ప్రయోజనాలను అర్హులకు చేరేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

# ఆధ్యాత్మికతకు.. ప్రపంచ నమూనా తిరుమల!



(మొదటి పేజీ తరువాయి)

గతంలో ఉన్న ఎస్వీ మ్యూజియాన్ని ఆధునీకరించి పునః ప్రారంభించారు. శ్రీవారి వైభవం, తిరుమల చరిత్ర, పురాణ గాథలు, శ్రీవారి పరిణయం తదితర అంశాలను భక్తులకు సులభంగా అర్థమయ్యే రీతిలో ప్రదర్శించేలా టీటీడీ ఈ మ్యూజియాన్ని సిద్ధం చేసింది. టీసీఎస్ ట్రస్ట్ రూ.104 కోట్లతో మ్యూజియాన్ని అభివృద్ధి చేసింది. శ్రీకృష్ణదేవరాయలు సహా వివిధ రాజులు శ్రీవారికి సమర్పించిన ఆభరణాల నమూనాలు, వివిధ కాలాలకు చెందిన చారిత్రక వస్తువులు, స్వామివారికి అలంకరించే కిరీటాలు, ఆభరణాల త్రీడీ నమూనాలను మ్యూజియంలో ఏర్పాటు చేశారు. పానోరమిక్ స్క్రీన్‌పై ఏఐ వీడియో ద్వారా శ్రీవారి పరిణయ విశేషాలను ముఖ్యమంత్రి తిలకించారు. శ్రీవారి సేవకోసం, స్వామి వారిని కీర్తించేందుకు ఆనాటి సంగీత కారులు వినియోగించిన వాయిద్య పరికరాలను కూడా మ్యూజియంలో సీఎం ఆసక్తిగా పరిశీలించారు.

**తిరుమలలో భక్తుల కోసం 32 ఎలక్ట్రిక్ బస్సులు :** తిరుమలలో భక్తుల రాకపోకలకు వీలుగా రిలయన్స్ ఫౌండేషన్, భారత్ బయోటెక్ సంస్థలు అందించిన 32 ఎలక్ట్రిక్ బస్సులను సీఎం జెండా ఊపి ప్రారంభించారు. రిలయన్స్ ఈ-మొబిలిటీ సీఈఓ నితిన్ సేత్, భారత్ బయోటెక్ ఎండీ సుచిత్రా ఎల్లా, మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు సహా టీటీడీ సభ్యులతో కలిసి నారాయణ గిరి సర్కిల్ నుంచి ఎస్వీ మ్యూజియం వరకూ ఎలక్ట్రిక్ బస్సులో సీఎం ప్రయాణించారు. తిరుమలకు వచ్చే ప్రతి భక్తుడికీ బీమా సదుపాయం కల్పించాలని టీటీడీ నిర్ణయించిందని సీఎం తెలిపారు. ఎల్ఐసీతో కలిసి ఆధార్ ఆధారిత ఆన్‌లైన్ బీమా అమలు చేయనున్నట్లు చెప్పారు. దురదృష్టవశాత్తూ తిరుమలలో భక్తుడు మరణిస్తే రూ.2 లక్షల ఆర్థిక సాయం అందేలా ఈ బీమా వర్తిస్తుందని తెలిపారు. రాష్ట్రంలో 5 వేల దేవాలయాలను శ్రీవాణి ట్రస్టు ద్వారా నిర్మాణం చేపడతామన్నారు. మారిషస్, న్యూజిలాండ్ వంటి దేశాల్లో కూడా శ్రీవారి ఆలయాలు నిర్మించాలని కోరుతున్నారని, దీనిపై ఆలోచన చేస్తున్నామని తెలిపారు. శ్రీవారి సేవకులను విద్య, వైద్య రంగాల్లోనూ వినియోగించుకునేలా కార్యాచరణ చేపడుతున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. ఆరు అంశాల్లో తిరుమల తిరుపతి దేవస్థాన కార్యకలాపాలను పునర్వ్యవస్థీకరిస్తామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.


# ఆంధ్రప్రదేశ్‌కు భారీగా ఇళ్ల కేటాయింపు

(మొదటి పేజీ తరువాయి)

తాజాగా మరో 2.25 లక్షల ఇళ్లను కేటాయించడంతో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రానికి మొత్తం మూడు లక్షల ఇళ్లు అందుబాటులోకి వచ్చినట్లు తెలిపారు. తెలంగాణకు ఇప్పటికే 79 వేల ఇళ్లు కేటాయించగా, తాజాగా మరో 1.21 లక్షల ఇళ్లు మంజూరు కావడంతో ఆ రాష్ట్రానికి మొత్తం రెండు లక్షల ఇళ్లు కేటాయించినట్లు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ చెప్పారు.

పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్లో భాగంగా ఈ ఇళ్ల కేటాయింపు జరిగిందని పీవీఎన్ మాధవ్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు పెద్ద సంఖ్యలో ఇళ్లు మంజూరు చేసినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రధాని మోదీ 25 ఏళ్ల ప్రజా ప్రస్థానంపై కాశీలో 'సేవా సంకల్ప్ అభియాన్'



**అమరావతి, సెప్టెంబర్ 16 (జర్నలిస్ట్ ఫైల్):** ప్రధాని మోదీ 25 ఏళ్ల ప్రజాసేవా ప్రస్థానాన్ని పురస్కరించుకుని వారణాసిలో నిర్వహిస్తున్న 'సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొనున్నారు. ముఖ్యమంత్రిగా, ప్రధానిగా ప్రజా జీవితంలో నరేంద్ర మోదీ చేసిన సేవలను పురస్కరించుకుని దేశవ్యాప్తంగా నెల రోజుల పాటు దేశవ్యాప్తంగా వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా కాశీ నగరంలో వారణాసి-వాద్నగర్ సేవా యాత్రను చేపట్టారు. ప్రధాని మోదీ ప్రజా జీవితంతో ప్రత్యేక అనుబంధం ఉన్న వారణాసి, వాద్నగర్‌ను అనుసంధానిస్తూ ఈ సేవా సంకల్ప్ అభియాన్ లో సీఎం చంద్రబాబు పాల్గొంటారు. యువత, ప్రజా ప్రతినిధులు, సేవా ప్రతినిధుల భాగస్వామ్యంతో ఈ సంకల్ప్ అభియాన్ చేప్టటారు. దేశ అభివృద్ధి ప్రయాణంలో ప్రజా భాగస్వామ్యం, సేవా భావం, సామాజిక బాధ్యత కీలకమనే సందేశాన్ని 'సేవా సంకల్ప్ అభియాన్' ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లనున్నారు. ప్రతీ గ్రామం, ప్రతి కుటుంబం, ప్రతి యువత, ప్రతి మహిళ అభివృద్ధి ప్రక్రియలో భాగస్వామి కావాలనే స్ఫూర్తితో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి ఏపీ సీఎం చంద్రబాబు హాజరు కానున్నారు.

**సీఎం చంద్రబాబు వారణాసి పర్యటన :** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గురువారం ఉదయం 7.30 గంటలకు విజయవాడ నుంచి బయలుదేరి 9.35 గంటలకు వారణాసి చేరుకుంటారు. ముందుగా 11.15 గంటలకు వారణాసిలోని శ్రీ కాశీ విశ్వనాథుడ్ని ముఖ్యమంత్రి దర్శించుకోనున్నారు. అనంతరం రుద్రాక్ష్ అంతర్జాతీయ కన్వెన్షన్ సెంటర్ చేరుకుని సేవా యాత్ర ఫ్లాగ్ ఆఫ్ కార్యక్రమంలో పాల్గొంటారు. తర్వాత మధ్యాహ్నం 3.10 గంటలకు వారణాసి నుంచి బయలుదేరి 5.15 గంటలకు తిరిగి అమరావతి చేరుకోనున్నారు.

# గార్లపాడు అంగన్వాడీ కేంద్రంలో ఘనంగా 'పోషణ్ మాహ్' కార్యక్రమం

**కాకుమాను(జర్నలిస్ట్ ఫైల్ ):** కాకుమాను మండల పరిధిలో ని గార్లపాడు అంగన్వాడీ కేంద్రంలో కాకుమాను సెక్టార్ సూపర్ వైజర్ వెంకాయమ్మ ఆధ్వర్యంలో 'పోషణ్ మాహ్' (పోషకాహార మాసోత్సవం) కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గర్భిణులు, బాలింతలు మరియు చిన్న పిల్లలకు పౌష్టికాహార ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. సరైన పోషకాహారం తీసుకోవడం ద్వారా తల్లీపిల్లల ఆరోగ్యం మెరుగుపడుతుందని సూపర్ వైజర్ వెంకాయమ్మ తెలిపారు. స్థానికంగా లభించే ఆకుకూరలు, పండ్లు, తృణధాన్యాలను ఆహారంలో విరివిగా భాగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు మరియు స్థానిక మహిళలు పాల్గొన్నారు.

# సహకార సంఘాల బలోపేతానికి కృషి చేయాలి



- నేలపాడు నూతన పాలకవర్గానికి ఆలపాటి రాజేంద్రప్రసాద్ సూచన

**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్ ):** సహకార సంఘాలను మరింత బలోపేతం చేసి, వాటి ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు నూతన పాలకవర్గాలు కృషి చేయాలని ఎమ్మెల్సీ, మాజీ మంత్రి, తెనాలి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి ఆలపాటి రాజేంద్రప్రసాద్ సూచించారు. పట్టణంలోని అయితానగర్ సాయిబాబా ఆలయం సమీపంలోని నన్నపనేని సీతారామయ్య, సరస్వతమ్మ కళ్యాణ మండపంలో నిర్వహించిన నేలపాడు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా నేలపాడు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడిగా అన్నాబత్తుని శ్రీనివాసరావుతో పాటు నూతనంగా ఎన్నికైన డైరెక్టర్లతో సంఘం అధికారి ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం నూతన పాలకవర్గాన్ని ఆలపాటి రాజేంద్రప్రసాద్‌తో పాటు పలువురు నాయకులు ఘనంగా సత్కరించారు. సహకార సంఘాల లక్ష్యాలను నెరవేర్చేలా పాలకవర్గ సభ్యులు సమష్టిగా పనిచేయాలని ఆలపాటి సూచించారు.

కార్యక్రమంలో మాజీ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి, జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పిల్లి మాణిక్యరావు, నన్నపనేని సుధాకర్, పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ కుద్దూస్, సహకార సంఘం అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వెటర్నరీ పోస్టుల భర్తీపై అసత్య ప్రచారం

(మొదటి పేజీ తరువాయి)

నియామక ప్రక్రియను నిలిపివేయాలనే ఉద్దేశంతో కొందరు తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తున్నారని పేర్కొంది. ప్రభుత్వ నిబంధనలు, అమల్లో ఉన్న మార్గదర్శకాలకు అనుగు ణంగానే పోస్టుల భర్తీ ప్రక్రియ కొనసాగుతోందని శాఖ సంచాలకులు తెలిపారు. వెటర్నరీ, లైవ్‌స్టాక్, డెయిరీ విభాగాలకు సంబంధించిన విద్యార్హతలు కలిగిన అభ్యర్థులకు అవకాశాలు కల్పించే ఉద్దేశంతో పోస్టుల విభజన చేపట్టినట్లు వెల్లడించారు. 2016లో జారీ చేసిన జీవో నంబర్ 52లో నిర్దేశించిన నిబంధనలను అనుసరించే పోస్టుల కేటాయింపు చేసినట్లు తెలిపారు. నియామక ప్రక్రియలో విద్యార్హతలకు సంబంధించిన వెయిటేజీలో ఎలాంటి కొత్త మార్పులు చేయలేదని స్పష్టం చేశారు. బీవీఎస్సీ అభ్యర్థులకు 60 మార్కులు, ఎంవీఎస్సీ అభ్యర్థులకు 10 మార్కుల వెయిటేజీ ఇప్పటికే అమల్లో ఉన్న నిబంధనల ప్రకారమే కొనసాగుతోందని పేర్కొ న్నారు. డెయిరీ టెక్నాలజీ విద్యార్హత కలిగిన అభ్యర్థులకు 4 మార్కుల వెయిటేజీ కేటాయింపు కూడా సంబంధిత నిబంధనల్లోనే ఉందని శాఖ వివరించింది. వివిధ విద్యార్హతలు, అభ్యర్థులకు అందుబాటులో ఉన్న అవ కాశాలను పరిగణనలోకి తీసుకుని నియామక విధానాన్ని రూపొందిం చినట్లు తెలిపింది. రాష్ట్రంలో వెటర్నరీ సేవలను మరింత బలోపేతం చేయడంతో పాటు అర్హత కలిగిన అభ్యర్థులకు న్యాయం జరిగేలా నియామక ప్రక్రియను చేపట్టినట్లు పేర్కొంది. పోస్టుల భర్తీ విషయంలో ప్రభుత్వ నిబంధనలు, చట్టబద్ధమైన విధానాలను పూర్తిగా పాటిస్తున్నామని పశుసంవర్ధక శాఖ మరోసారి స్పష్టం చేసింది.

# విద్యుత్ శాఖలో ఉద్యోగుల సంక్షేమానికి పెద్దపీట

- కారుణ్య నియామకాల ద్వారా కూటమి ప్రభుత్వంలో 389 మందికి ఉద్యోగాలు
- 25 మందికి ఏపీసీపీడీసీఎల్ లో కారుణ్య నియామకం కింద ఉద్యోగ నియామకాలు
- రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్




**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలో విద్యుత్ శాఖ ఉద్యోగుల సంక్షేమం, యువతకు ఉద్యోగ అవకాశాలు, విద్యుత్ రంగంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. స్థానిక గుణదలలోని ఆంధ్రప్రదేశ్ మధ్య ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ల్లో కారుణ్య నియామక ఉత్తర్వులు అందించే ప్రదాన కార్యక్రమంలో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ పాల్గొని మాట్లాడుతూ.. విద్యుత్ శాఖలో చేపడుతున్న వివిధ ఉద్యోగ, సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. కారుణ్య నియామకాల ద్వారా 389 మందికి ఉద్యోగాలు కారుణ్య నియామకాల కింద తాజాగా 25 మంది ఉద్యోగార్థులకు ఉద్యోగ నియామక పత్రాలను మంత్రి అందజేశామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ట్రాన్స్ కో, జెన్కో, సీపీడీసీఎల్, ఈపీడీసీఎల్, ఎస్పీడీసీఎల్ సంస్థల్లో ఇప్పటివరకు మొత్తం 389 మందికి కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగాలు కల్పించినట్లు తెలిపారు.

మరణించిన విద్యుత్ శాఖ ఉద్యోగుల కుటుంబాల్లో వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి స్పష్టం చేశారు. ఉద్యోగి పిల్లలు చిన్న వయస్సులో ఉన్నా, అర్హత కలిగిన వయస్సుకు వచ్చినా వారు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అర్హులైన మరో 35 నుంచి 45 మందికి కట్‌ఆఫ్ తేదీని నిర్ణయించి ప్రత్యేకంగా పరిగణించి వారికి ఉద్యోగాలు కల్పించేందుకు అధికారులను ఆదేశించినట్లు చెప్పారు.

629 ఏఈ పోస్టుల భర్తీకి పరీక్షలు నిర్వహించాం త్వరలో ఫలితాలు అందిస్తామని, విద్యుత్ శాఖలోని అన్ని విభాగాలను కలిపి 629 అసిస్టెంట్ ఇంజనీర్ పోస్టుల భర్తీకి పరీక్షలు నిర్వహించామని మంత్రి తెలిపారు. త్వరలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియను పూర్తి చేసి, అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా నియామక ప్రక్రియను నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటి వరకు విద్యుత్ శాఖ ఉద్యోగులకు మూడు డిఏ లు ఇచ్చినట్లు మంత్రి తెలిపారు. ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయంగా ఎలక్ట్రిసిటీ విభాగం పనిచేస్తోందన్నారు. విద్యుత్ శాఖ ఉద్యోగులకు మెరుగైన శిక్షణ అందించేందుకు విశాఖపట్నంలో దాదాపు రూ. 30 కోట్ల వ్యయంతో ప్రత్యేక ట్రైనింగ్ సెంటర్‌ను నిర్మించామని మంత్రి తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఉద్యోగులకు నాణ్యమైన శిక్షణ అందించడమే దీని ఉద్దేశమన్నారు.

**గ్రీన్ ఎనర్జీకి ప్రోత్సాహం :** రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో గ్రీన్ ఎనర్జీని ప్రోత్సహించేందుకు సోలార్, విండ్ ప్రాజెక్టులను ప్రోత్సహిస్తున్నామని మంత్రి తెలిపారు. సౌర విద్యుత్ వినియోగాన్ని మరింత విస్తరించే చర్యల్లో భాగంగా సుమారు 6 లక్షల మంది ఎస్సీ, ఎస్టీ వర్గాల కుటుంబాలకు సూర్య ఘర్ పథకం ద్వారా ఇళ్లపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ మౌలిక వసతులను బలోపేతం చేసేందుకు ఆర్డీఎస్ఎస్ పథకం ద్వారా సుమారు రూ. 10,000 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు మంత్రి తెలిపారు. విద్యుత్ శాఖలో ఉద్యోగ నియామకాలతో పాటు ఉద్యోగుల సంక్షేమం, శిక్షణ, పునరుత్పాదక ఇంధన ప్రోత్సాహం, గ్రామీణ విద్యుత్ మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం సమగ్ర చర్యలు చేపడుతోందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు.

కార్యక్రమం అనంతరం మంత్రి గొట్టిపాటి రవికుమార్ కారుణ్య ఉద్యోగ నియామక పత్రాలను అందించారు. కార్యక్రమంలో ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పి. పుల్లారెడ్డి, డైరెక్టర్ టెక్నికల్ ఆవుల మురళీకృష్ణ యాదవ్, డైరెక్టర్ ప్రాజెక్ట్స్ ఉ హెచ్ ఆర్ టీవీఎస్ఎన్ మూర్తి, డైరెక్టర్ ఫైనాన్స్ ఎస్ వెంకటేశ్వర్లు, సీజీఎంలు, జీఎంలు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# కోడెల శివప్రసాదరావు సేవలు చిరస్మరణీయం



- వేమూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి నక్కా ఆనంద బాబు

**రొంపిచర్ల (జర్నలిస్ట్ ఫైల్):** ప్రజా సేవలో డాక్టర్ కోడెల శివప్రసాదరావు చేసిన విశేష కృషి, పల్నాడు ప్రాంత అభివృద్ధికి అందించిన సేవలు ఎప్పటికీ చిరస్మరణీయంగా నిలిచిపోతాయని వేమూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి నక్కా ఆనంద బాబు పేర్కొన్నారు. నవ్యాంధ్రప్రదేశ్ తొలి శాసనసభాపతి, పల్నాటి పులి కోడెల శివప్రసాదరావు 7వ వర్ధంతి సందర్భంగా రొంపిచర్ల మండలం ముత్తనపల్లి గ్రామంలో నిర్వహించిన విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కోడెల శివప్రసాదరావు విగ్రహాన్ని నక్కా ఆనంద బాబు ఆవిష్కరించి ఘనంగా నివాళులర్పించారు. కోడెల శివప్రసాదరావు రాజకీయ జీవితంలో ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయడంతో పాటు పల్నాడు ప్రాంత సమగ్ర అభివృద్ధికి విశేషంగా పాటుపడ్డారని ఆయన అన్నారు. ప్రజలతో మమేకమై పనిచేసిన ఆయన సేవా స్ఫూర్తి భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు.

కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, కోడెల శివప్రసాదరావు అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కోడెల శివప్రసాదరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను స్మరించుకుంటూ పలువురు నాయకులు ప్రసంగించారు. కార్యక్రమం సందర్భంగా ముత్తనపల్లిలో కోడెల అభిమానులు, పార్టీ శ్రేణుల్లో ప్రత్యేక ఉత్సాహం నెలకొంది.

# మంత్రి కందుల దుర్గేష్‌కు అభినందనల వెల్లువ



- సెప్టెంబర్ 17 న నిడదవోలులోని లయన్స్ క్లబ్ లో మంత్రి కందుల దుర్గేష్ జన్మదిన వేడుకలు
- విజ్జేశ్వరం నుండి నిడదవోలు వరకు భారీ బైక్ ర్యాలీ
- లయన్స్ క్లబ్ ప్రాంగణంలో పుట్టినరోజు వేడుకల్లో పాల్గొననున్న మంత్రివర్యులు దుర్గేష్

**నిడదవోలు (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రివర్యులు కందుల దుర్గేష్ జన్మదిన వేడుకలను సెప్టెంబర్ 17వ తేదీన (రేపు) నిడదవోలు నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించనున్నట్లు మంత్రివర్యుల కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ సందర్భంగా రాజకీయ నాయకులు, కార్యకర్తలు, జనసైనికులు, వీర మహిళలు, అభిమానుల నుండి మంత్రివర్యులకు శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. ఈ సందర్భంగా ఉదయం 8:30 గంటలకు విజ్జేశ్వరం గ్రామం నుండి ప్రారంభమై నిడదవోలు పట్టణం వరకు కూటమి నాయకులు, జనసైనికులు, అభిమానుల భాగస్వామ్యంతో భారీ బైక్ ర్యాలీ నిర్వహించబడుతుంది. 10:00 గంటలకు నిడదవోలు పట్టణంలోని లయన్స్ క్లబ్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన జన్మదిన వేడుకల్లో మంత్రి కందుల దుర్గేష్ పాల్గొని, అభిమానులు, నాయకులు, కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేయనున్నారు. ఉదయం 11:00 గంటల నుండి వేడుకలకు విచ్చేసే జనసేన సైనికులు, వీర మహిళలు, కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలందరికీ లయన్స్ క్లబ్ ప్రాంగణంలో భారీ ఎత్తున భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ వేడుకలకు నియోజకవర్గం నలుమూలల నుండి పెద్ద సంఖ్యలో ప్రజలు, అభిమానులు తరలివస్తుండటంతో ఎటువంటి అసౌకర్యం కలగకుండా ముందుజాగ్రత్త చర్యగా భారీ భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు మంత్రి కార్యాలయం వెల్లడించింది.

## 17న ప్రజా పాలన దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు

- కార్యక్రమానికి హాజరు కానున్న రాష్ట్ర శాసన పరిషత్ చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి
- సంబంధిత అధికారు లను ఆదేశించిన జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ భాస్కర్ రావు



యాదాద్రి భువనగిరి సెప్టెంబరు 16 (జర్నలిస్ట్ ఫైల్) : మంగళవారం రోజు అదనపు కలెక్టర్ ఛాంబర్ లో తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ వేడుకల ఏర్పాట్ల పై రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డితో కలిసి సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఇంచార్జి కలెక్టర్ మాట్లాడుతూ కలెక్టరేట్ ప్రాంగణంలో నిర్వహించనున్న ప్రజా పాలన దినోత్సవ వేడుకలకు అధికారులు సమన్వయం తో పనిచేసి అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర శాసన పరిషత్ చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి హాజరు కానున్నట్లు తెలిపారు. కలెక్టరేట్ ప్రాంగణంలో కార్య క్రమానికి అనుగుణంగా వేదికను ఏర్పాటు చేయడంతో పాటు , వీఐపీలు , అధికారులు , ఇతర అతిథులకు అను కూలంగా సిట్టింగ్ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కార్యక్రమ వివరాలతో కూడిన ఆహ్వానాలను ముఖ్య అతిథితో పాటు ప్రోటో కాల్ ప్రకారం సంబంధిత ప్రజా ప్రతి నిధులకు అందజేయాలని సూచించారు. వేదికను పూలతో అందంగా అలంకరించాలని , కార్య క్రమంలో విద్యార్థు లచే సాంస్కృతిక కార్య క్రమాలు నిర్వహించేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా విద్యా శాఖ అధికారిని ఆదేశించారు. వేడుకలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా జరిగేలా అన్ని శాఖల అధికారులు పరస్పరం సమన్వయంతో పని చేయాలని ఇంచార్జి కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జయమ్మ , జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి , అడ్మినిస్ట్రేటివ్ అధికారి అంజిరెడ్డి , వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆపదలో అండగా ప్రజా ప్రభుత్వం..

- 200 కుటుంబాలకు రూ.1.10 కోట్ల CMRF సాయం
- అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందేలా కృషి : ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



మిర్యాలగూడ సెప్టెంబరు 16 (జర్నలిస్ట్ ఫైల్) : మిర్యాలగూడ నియోజకవర్గ ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందని మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. ఆపదలో ఉన్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ ఎనిధి (CMRF) అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. మంగళవారం మిర్యాలగూడ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 200 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.1 కోటి 10 లక్షల 50 వేల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి(CMRF) చెక్కులను ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు CMRF ద్వారా ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తూ భరోసా కల్పిస్తోందన్నారు. ప్రజలకు అవసరమైన సమయంలో ప్రభుత్వం అండగా ఉంటుందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధితో పాటు ప్రజల సంక్షేమానికి తన వంతు కృషి నిరంతరం కొనసాగిస్తానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సహాయ కార్యక్రమాలు చేరేలా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిసిసి జిల్లా ప్రధాన కార్యదర్శి చిలుకూరువి బాలు, గుడిపాటి నవీన్, కాంగ్రెస్ పార్టీ వన్ టౌన్ టూ టౌన్ అధ్యక్షులు కోడి రెక్క ఇంద్ర కుమార్, ఇయాజ్, కౌన్సిలర్లు జావిద్, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాద బాధిత కుటుంబాలకు రూ.15 లక్షల ఆర్థిక సహాయం

- చెక్కులు అందజేసిన ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం.



నల్గొండ, సెప్టెంబరు 16 (జర్నలిస్ట్ ఫైల్) : నకిరేకల్ నియోజకవర్గం: కేతేపల్లి మండల కేంద్రానికి చెందిన ప్రమాద బాధిత కుటుంబాలకు ప్రభుత్వం ద్వారా మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి (జవీ=ఖీ) ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అందజేశారు. 2017లో కేతేపల్లి మండల కేంద్రానికి చెందిన పసల పూజిత, స్వాతిక, పసల తేజస్వి, సిరిల్ కుమార్, పవన్ కుమార్ అనే చిన్నారులు ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందారు. ఘటన అనంతరం అప్పటి ఎమ్మెల్యేగా ఉన్న ప్రస్తుత ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం బాధిత కుటుంబాలను పరామర్శించి, ఒక్కో కుటుంబానికి తక్షణ సహాయం కింద రూ.1 లక్ష చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు. అనంతరం బాధిత కుటుంబాలకు మరింత సహాయం అందేలా ఎమ్మెల్యే వేముల వీరేశం ప్రత్యేక చొరవ తీసుకుని ప్రభుత్వం ద్వారా జవీ=ఖీ కింద రూ.15 లక్షల ఆర్థిక సహాయం మంజూరు చేయించారు. ఈ మేరకు మంజూరైన ఆర్థిక సహాయానికి సంబంధించిన చెక్కులను నేడు మూడు బాధిత కుటుంబాల సభ్యులకు ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే వేముల వీరేశానికి, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని, వారి సంక్షేమానికి అన్ని విధాలా సహకారం అందిస్తుందని ఎమ్మెల్యే వేముల వీరేశం తెలిపారు.

## నూతన కోర్టు భవనాల నిర్మాణానికి స్థలం కేటాయించాలి..



మిర్యాలగూడ, సెప్టెంబరు 16 (జర్నలిస్ట్ ఫైల్) : పెరుగుతున్న జనాభా, కేసులకు అనుగుణంగా మిర్యాలగూడలో నూతన కోర్టు భవనాల నిర్మాణానికి ఆరెకరాల స్థలం కేటాయించాలని కోరుతూ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ గారికి వినతిపత్రం అందించారు. అసోసియేషన్ అధ్యక్షుడు గౌరు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... పట్టణంలో జనాభా పెరుగుతున్న కొద్దీ న్యాయపరమైన వివాదాలు, కేసుల సంఖ్య కూడా పెరుగుతుండడంతో ప్రస్తుతం ఉన్న కోర్టు భవనం భవిష్యత్ అవసరాలకు సరిపోని పరిస్థితి నెలకొన్నదన్నారు. అన్ని రకాల కోర్టులను ఒకే భవన సముదాయంలో ఏర్పాటు చేసేలా నూతన కోర్టు భవనాన్ని నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ వినతిపై ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ సానుకూలంగా స్పందించారు. సంబంధిత స్థానిక అధికారులతో మాట్లాడి, నూతన కోర్టు భవన నిర్మాణానికి అవసరమైన స్థలం కేటాయించే విషయంపై త్వరితగతిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఈసరం కరుణాకర్, ప్రధాన కార్యదర్శి జంగిలి ఎల్లయ్య, జాయింట్ సెక్రటరీ రాయారపు భాస్కర్, కోశాధికారి రెడ్డిపల్లి సైదులు, పెండ్యాల నరసింహారావు, పి పి రఘురామారావు, ఏజీపీ మిట్టపల్లి శ్రీధర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

# హామీల అమలే లక్ష్యం.. ప్రజా సంక్షేమమే ధ్యేయం!

- 1000 రోజులు పూర్తి చేసుకున్న ప్రజా ప్రభుత్వం..
- ప్రతిపక్షాల అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మరు:ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



మిర్యాలగూడ, సెప్టెంబరు 16 (జర్నలిస్ట్ ఫైల్) : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రజా ప్రభుత్వం 1000 రోజులు పూర్తి చేసుకుందని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన పలు కీలక అంశాలపై మాట్లాడారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రభుత్వంపై ప్రతిపక్షాలు కావాలనే అసత్య ప్రచారాలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు. రాష్ట్ర ప్రజలు వాస్తవాలను గమనిస్తున్నారని, ప్రతిపక్షాల ప్రచారాన్ని నమ్మే పరిస్థితి లేదన్నారు. గత పదేళ్ల పాలనలో జరిగిన అవినీతి, అక్రమాలు బయటపడతాయనే భయంతోనే బీఆర్ఎస్ నేతలు అసెంబ్లీ సమావేశాలను విస్మరిస్తున్నారని ఆరోపించారు. మాక్ అసెంబ్లీల పేరుతో చట్టసభల వ్యవస్థను అపహాస్యం చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమన్నారు. అధికారులపై దాడులకు పాల్పడి, అనంతరం సానుభూతి పొందేందుకు దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. గత పాలకుల హయాంలో పలు అభివృద్ధి పనుల్లో, ముఖ్యంగా యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ విషయంలో జరిగినట్లు ఆరోపణలు వస్తున్న బినామీ వ్యవస్థ, దోపిడీకి సంబంధించిన వాస్తవాలను త్వరలోనే ప్రజల ముందుకు తీసుకువస్తామని ఎమ్మెల్యే తెలిపారు.

**ప్రతి గణేష్ మండపానికి రూ.5,016 సాయం**

వినాయక చవితి సందర్భంగా మిర్యాలగూడ నియోజకవర్గంలోని ప్రతి గణేష్ మండపానికి 'BLR బ్రదర్స్' ఆధ్వర్యంలో రూ.5,016 చొప్పున ఆర్థిక సహాయం అందించనున్నట్లు ఎమ్మెల్యే ప్రకటించారు. గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని ప్రజలకు, ఉత్సవ కమిటీలకు సూచించారు. మిర్యాలగూడ నియోజకవర్గ అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అందిస్తున్న సహకారం ఎంతో కీలకమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ముఖ్యమంత్రి సహకారంతో నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను దశలవారీగా పూర్తి చేసి ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉంటూ అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతామని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి స్పష్టం చేశారు. డిసిసి ప్రధాన కార్యదర్శి చిలుకూరి బాలకృష్ణ, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గుడిపాటి నవీన్, నూకల వేణుగోపాల్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పొదిల్ల శ్రీను, తలకొప్పుల సైదులు, మిర్యాలగూడ పట్టణ మరియు మండల అధ్యక్షులు కోడి రెక్క ఇంద్ర కుమార్, ఎండి మోయిస్ గుండు నరేందర్ గౌడ్, దామచర్ల వేములపల్లి మండల అధ్యక్షులు నాగు నాయక్ రేగటి రవీందర్ రెడ్డి, మరియు కౌన్సిలర్లు సోమ్ సుందర్, బూడిద సైదులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# అధికారుల తీరుపై సర్పంచ్‌లు గరం గరం

- మండల అధికారుల తీరుపై ప్రజాప్రతినిధుల ఆగ్రహం..
- గ్రామాలకు అధికారులు రావడమే మర్చిపోయారు..
- సర్వసభ్య సమావేశానికి పలువురు అధికారుల గైర్హాజరు..
- పంచాయతీ ఆపరేటర్ల పెత్తనంపై సర్పంచుల అసంతృప్తి..



గరిడేపల్లి, సెప్టెంబరు 16 (జర్నలిస్ట్ ఫైల్) : గరిడేపల్లి మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశం వాడీవేడిగా సాగింది. మండలంలోని పలు శాఖల అధికారులు ప్రజలకు, సర్పంచులకు అందుబాటులో ఉండడం లేదని పలువురు సర్పంచులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశానికి పలువురు అధికారులు గైర్హాజరు కావడంపై ఎంపీడీవోను నిలదీశారు. పొనుగోడు సర్పంచ్ కటకం వేణు, రాయినిగూడెం సర్పంచ్ గుండు రామాంజి గౌడ్, కుతుబ్షాపురం సర్పంచ్ ఆకుల కృష్ణ తదితరులు అధికారుల పనితీరుపై ప్రశ్నలు సంధించారు. గ్రామాల్లో సమస్యలు తలెత్తినప్పుడు సంబంధిత శాఖల అధికారులు స్పందించడం లేదని, మండలంలో పనిచేస్తున్న కొన్ని శాఖల అధికారులకు జవాబుదారీతనం లేకుండా పోయిందని విమర్శించారు. ప్రభుత్వ పాఠశాలలకు వస్తున్న నిధులు, వాటి వినియోగం, ఆడిటింగ్‌పై స్పష్టత ఇవ్వాలని సర్పంచులు కోరారు. పాఠశాలల్లో చిన్నచిన్న అవసరాలకు సైతం గ్రామ పంచాయతీలపై ఆధారపడాల్సి వస్తోందని పేర్కొన్నారు. సాగర్ నీటిని పంటలకు విడుదల చేస్తున్నారా, చెరువుల నింపుదలకా అనే విషయంపై నీటిపారుదల శాఖ నుంచి స్పష్టత లేదని ప్రశ్నించారు. ఇందిరమ్మ ఇళ్ల సమస్యలపై ఫోన్ చేసినా అధికారులు స్పందించడం లేదని ఆరోపించారు.

**పంచాయతీ ఆపరేటర్లపై ఆరోపణలు**

ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ ఆపరేటర్ల పెత్తనం కొనసాగుతోందని సర్పంచులు ఆరోపించారు. గ్రామ పంచాయతీలకు సంబంధించిన నిధుల విషయంలోనూ సర్పంచులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కార్యాలయంలో ఎంపీడీవో ఆదేశాలు అమలవుతున్నాయా లేదా అనే అనుమానాలు కలుగుతున్నాయని వ్యాఖ్యానించారు. ఓ ఆపరేటర్‌పై కేసు నమోదై జైలుకు వెళ్లి వచ్చినప్పటికీ అదే విధుల్లో కొనసాగించడంపై చర్యలు తీసుకోకపోవడాన్ని ప్రశ్నించారు.

**రేషన్ షాపులపై ఫిర్యాదులు**

పొనుగోడు రేషన్ షాపును ఎల్బీనగర్‌కు చెందిన డీలర్ నిర్వహిస్తుండటంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారని సర్పంచ్ కటకం వేణు తెలిపారు. పొనుగోడుకు కొత్త డీలర్‌ను నియమించాలని కోరారు. కుతుబ్ షాపురంలోనూ ఇదే పరిస్థితి ఉందని సర్పంచ్ ఆకుల కృష్ణ పేర్కొంటూ వెంటనే కొత్త డీలర్‌ను నియమించాలని కోరారు.

ఇందిరమ్మ ఇళ్లలో ఎల్-3 నుంచి ఎల్-1కు మార్పు ప్రక్రియలో ఎదురవుతున్న ఇబ్బందులను సర్పంచులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అలాగే వివోఏ భవనాల నిర్మాణంలో రాజకీయ వివక్ష చూపుతున్నారని కొందరు బీఆర్ఎస్ అనుబంధ సర్పంచులు ఆరోపించారు. తమ గ్రామాల్లోనూ నూతన భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. విద్య, వైద్యం, వ్యవసాయం, ఉపాధి, నీటిపారుదల తదితర శాఖలకు సంబంధించిన పలు సమస్యలను సర్పంచులు సమావేశంలో ప్రస్తావించారు. సమస్యలను పరిశీలించి పరిష్కరిస్తామని సంబంధిత అధికారులు హామీ ఇచ్చారు.

సమావేశంలో ఎంపీడీవో సరోజ, తహసీల్దార్ స్రవంతి, ఎంఈఓ ఛత్రునాయక్, ఎంపీఓ ఇబ్రహీం, ఏపీఎం అజయ్, ఏపీవో సురేష్, జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షుడు గుండు రామాంజి గౌడ్, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

# గిరిజనులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలి

- మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్

మహబూబ్‌నగర్ సెప్టెంబరు 16 (జర్నలిస్ట్ ఫైల్) : మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో గిరిజనులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశం అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి వి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో గిరిజనులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయకుండా మోసం చేసిందన్నారు. అంబెడ్కర్ అభయహస్తం పథకం ద్వారా ఎస్టీ కుటుంబాలకు రూ. 12 లక్షలకు ఇస్తామని ఇవ్వలేదు. ప్రభుత్వ ప్రొక్యూర్మెంట్.. కాంట్రాక్టు లలో 12 శాతం రెసర్వేషన్ ఇస్తామని మోసం చేసారు.

పోడు భూములకు పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చి ప్రభుత్వం మాట తప్పిందని అన్నారు. గిరిజన విద్యార్థుల విద్య జ్యోతి పథకం ద్వారా చదువు కోసం రూ.25 వేల నుంచి రూ.లక్ష వరకు ప్రోత్సాహకం అందిస్తామని చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం హామీని విస్మరించిందన్నారు. కేసీఆర్ బీఆర్ఎస్ ప్రభుత్వం లో గిరిజనుల జనాభాకు అనుగుణంగా ఎస్టీలకు 10% రిజర్వేషన్ లు ఇవ్వడం జరిగింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 3,146 తండాలను గ్రామపంచాయతీలుగా గుర్తించామని, తద్వారా సుమారు 30 వేల మంది గిరిజనులు ప్రజాప్రతినిధులుగా ఎదిగే అవకాశం కల్పించడం జరిగింది. హైదరాబాద్‌లో సేవలాల్ బంజారా భవన్, కొమురం భీం ఆదివాసీ భవన్ ను నిర్మించుకోవడం జరిగింది. గిరిజనుల కోసం సుమారు రూ.100 కోట్ల ఆస్తులు, రూ.25 కోట్ల నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగింది. తండాలకు విద్యుత్ సదుపాయం కల్పించడంతో పాటు ఇంటింటికీ తాగునీరు అందించడం జరిగింది. కేసీఆర్ పదేళ్ల పాలనలో తండాల్లో జీవన ప్రమాణాలు గణనీయంగా పెరిగాయి, గురుకులాలు, వసతి గృహాల్లో నాణ్యమైన విద్య, వసతి, భోజన సౌకర్యాలు కల్పించడం జరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గురుకులాలు, వసతి గృహాల్లో పరిస్థితులు అధ్వానంగా తయారయ్యాయి.




మూడు సంవత్సరాలు గడుస్తున్నా గిరిజనులకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం దారుణమని, రాజకీయంగా కూడా గిరిజనులకు తగిన అవకాశాలు కల్పించడం లేదన్నారు. గిరిజన కార్పొరేషన్లకు తగిన నిధులు కేటాయించి గిరిజనుల అభివృద్ధికి ప్రభుత్వం సహకరించాలన్నారు.

మహబూబ్ నగర్ పట్టణ కేంద్రంలోని ఎదిర లో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 2 కోట్ల 75 లక్షల రూపాయలతో వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

మహబూబ్ నగర్ స్టేడియం గ్రౌండ్స్ సమీపంలో రూ. 1.70 కోట్ల వ్యయంతో కళాశాలలో చదివే గిరిజన విద్యార్థినుల కోసం నిర్మించిన ప్రభుత్వ గిరిజన కళాశాల వసతి గృహాన్ని ప్రారంభించడం జరిగిందని పేర్కొన్నారు. మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని పద్మావతి కాలనీ అయ్యప్ప కొండ పై 2 వేల గజాల స్థలం తో పాటు రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కోటి 10 లక్షల రూపాయలతో గిరిజన భవన్ పూర్తి చేసినట్టు తెలిపారు. గిరిజన విద్యార్థులు..వర్కింగ్ మహిళల కోసం రూ 4 కోట్లతో అన్ని వసతులతో భవన నిర్మాణం పూర్తి చేసాము.

గిరిజన యువతలో నైపుణ్యాలు పెంపొందించేందుకు వనగట్టు వద్ద ప్రత్యేక శిక్షణ కేంద్రం రూ 2.75 కోట్లతో ఏర్పాటు చేశామని తెలిపారు. హన్వాడ మండలం ఎనిమిది తండా వద్ద సంత్ సేవాలాల్ దేవాలయానికి 500 గజాల స్థలం ఇవ్వడంతో పాటు రూ . 10 లక్షల నిధులు మంజూరు చేసినట్టు పేర్కొన్నారు. హన్వాడ మండలం దాచకపల్లి గ్రామంలో 36 చెంచుల కుటుంబాలు 76 యేండ్ల నుంచి వ్యవసాయం చేస్తున్న పట్టాలు లేవు. 15 ఎకరాల 9 గుంటల పోడు భూమి ఉంటె అధికారులతో మాట్లాడి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కారం చేసి పట్టాలు ఇచమని అన్నారు.. పొలాలలు సాగు చేసేందుకు కరెంటు సదుపాయం కల్పించామన్నారు . రైతు బంధు పడుతుంది.. బ్యాంకు ద్వారా రుణాలు పొంది వ్యవసాయం చేస్తున్నారు. చెంచుల కోసం హన్వాడ మండలం యారొనిపల్లి వద్ద 24 ఇండ్ల నిర్మాణం ప్రారంభించాము. చెత్తు వరకు నిర్మాణం పూర్తి ఐంది.. ప్రభుత్వం మారడంతో పనులు నిలిచిపోయినవి.. శిధిలావస్థలో భవనాలు ఉన్నాయ్. వాటిని పూర్తి చేసి చెంచులకు ఇవ్వాలి. పేద ఎస్టీలకు మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో నిర్మాణం చేసిన డబల్ బెడ్ రూమ్స్ లో 167 కేటాయింపు చేసినట్టు తెలిపారు మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో ఎరుకల సంఘానికి కేటాయించిన భూమిని అందించడంలో అధికారులు ఇబ్బందులు పెడుతున్నారని, వెంటనే ఆ భూమిని వారికి అప్పగించాలన్నారు. అమర్ రాజా కంపెనీ విషతుల్యం అయింది అని తప్పుడు ప్రచారం చేసిన కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు కంపెనీ మంచిదని మాట్లాడుతున్నారు. మేము అన్ని పరిశీలించిన తరువాతే కంపెనీ తీసుకువచ్చాము. కనీసం వెయ్యి పడకల అస్పత్రి ప్రారంభించలేని పరిస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉంది. కార్పొరేషన్ మాజీ చైర్మన్ వాల్యా నాయక్ ప్రెస్ మీట్.

కాంగ్రెస్ ప్రభుత్వం అబద్దాలు చెప్పి గిరిజనులను మోసం చేసింది. గిరిజన బిడ్డల విదేశీ విద్యకు కెసిఆర్ ప్రభుత్వం సహకారం ఇచ్చింది. గురుకుల విద్యాలయాలు.. వసతి గృహల నిర్వహణ సరిగ్గా లేదు. విద్యార్థులు అనారోగ్యం బారిన పడుతున్నారు. సర్పంచుల సంఘం జేఏసీ చైర్మన్ ప్రతాప్ నాయక్, బీ ఆర్ ఎస్ పార్టీ హన్వాడ ర్ సెల్ అధ్యక్షులు హరిచందర్, కార్పొరేటర్ రమేష్ నాయక్, సీనియర్ నాయకులు రమేష్ నాయక్, రవీందర్ నాయక్, పూర్య నాయక్, సురేష్ నాయక్, మోహన్ నాయక్, రవి నాయక్. అంబు నాయక్, నెహ్రు నాయక్, రాజేష్ నాయక్, భాస్కర్ నాయక్ పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే బీర్ల పై బురదజల్లే ప్రయత్నాలు మానుకోవాలి

బొమ్మలరామారం, సెప్టెంబరు 16 (జర్నలిస్ట్ ఫైల్) : ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యను ప్రజాక్షేత్రంలో గెలవలేమని ప్రతిపక్ష నాయకులు బురద జల్లె ప్రయత్నం చేయడం సరికాదని తుర్కపల్లి కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు సింగిల్ విండో చైర్మన్ ధీరవత్ శంకర్ నాయక్ ,తుర్కపల్లి కాంగ్రెస్ మండల్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ షాడ భాస్కర్ రెడ్డి, రాజారాం నాయక్ అన్నారు మంగళవారం బొమ్మలరామారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా రియల్ ఎస్టేట్ రంగంలో ఉన్నామని ఎవరు అధికారంలో ఉన్న ఎవరు అధికారంలో లేకపోయినా తమ వ్యాపారం భూముల వ్యాపారమనీ వారు తెలిపారు ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు సన్నితంగా ఉన్నామని తమకు పార్టీలో పదవులు ఇచ్చినంత మాత్రాన తాము చేస్తున్న రియల్ వ్యాపారంలో బీర్ల ఐలయ్యకు కూడా సంబంధం ఉందని ప్రతిపక్షాలు ఆరోపించడం ఎంత మట్టుకు సబబు అని ఆరోపించారు. బొమ్మలరామారం మండల కేంద్రంలోని రంగాపూర్ బొమ్మలరామారం రెవెన్యూ పరిధిలో సర్వే నెంబర్ 76. 78 .142 .143 లోని 14 ఎకరాల 36 గుంటల భూమికి సంబంధించి అసలు పట్టాదారులైన ఎర్వ శశికాంత్ రెడ్డి సన్నాఫ్ మోహన్ రెడ్డి వారి దగ్గర నుంచి మేము లీగల్ పరంగా భూమికి సంబంధించిన అన్ని పత్రాలను చూసి కొనుగోలు చేశామని మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో పట్టాదారులతో కలిసి వెల్లడించారు కేవలం కొంతమంది రాజకీయంగా మేము చేస్తున్న వ్యాపారానికి ఇబ్బంది కలిగించి దాంతోపాటు ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యను రాజకీయంగా ఎదుర్కోలేక భూముల వ్యాపారం అంటగడుతూ అతనిపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని వారు ఆరోపించారు. భూమికి సంబంధించి ఎవరైతే ఆరోపణలు చేస్తున్నారో ప్రజాక్షేత్రంలో వారి దగ్గర ఉన్న పత్రాలను తీసుకొని రావాలని ప్రశ్నించారు. భూమికి సంబంధించిన అసలు పట్టాదారులను సంబంధిత పత్రాలతో రప్పిస్తామని ప్రజాక్షేత్రంలో ఎవరు దోషులు తేలుతుందని అన్నారు. భూమి పట్టాదారులు శశికాంత్ రెడ్డి మాట్లాడుతూ మా



ఆర్థిక అవసరాల కోసంమే మా భూమిని శంకర్ నాయక్, శాడ భాస్కర్ రెడ్డి, రాజారాం నాయక్ కు అమ్మకం జరిపినట్లు దీనిలో ఎవరి ప్రమేయం లేదని ఈ భూమికి ఎమ్మెల్యేకు ఎలాంటి సంబంధం లేదని కావాలని ఈ భూమిని లాక్కోవడానికి కొంతమంది రాజకీయంగా మమ్మల్ని ఇబ్బంది పెడుతున్నారని అసలైన పట్టాదారులను మేమని హైకోర్టులో కూడా తమకు అనుకూలంగా తీర్పు వచ్చిందని ఎరువ శశికాంత్ రెడ్డి తెలిపారు.

# తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా బీజేపీ మహిళా మోర్చా స్కూటీ ర్యాలీ

**నేరేడ్‌మేట్, సెప్టెంబరు 16 (జర్నలిస్ట్ ఫైల్) :**

తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన స్కూటీ ర్యాలీ ఉత్సాహంగా సాగింది. ఈ ర్యాలీలో కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావుతో కలిసి వినాయక్‌నగర్ మాజీ కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.తెలంగాణ విమోచన దినోత్సవం ప్రాధాన్యతను ప్రజలకు తెలియజేయడంతో పాటు తెలంగాణ కోసం పోరాడిన వీరుల త్యాగాలను స్మరించుకోవాలనే ఉద్దేశంతో మహిళా మోర్చా ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించినట్లు నాయకులు తెలిపారు. పెద్ద సంఖ్యలో మహిళా కార్యకర్తలు స్కూటీలపై ర్యాలీలో పాల్గొని నినాదాలు చేస్తూ ఉత్సాహంగా ముందుకు సాగారు.ఈ సందర్భంగా క్యానం రాజ్యలక్ష్మి మాట్లాడుతూ తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. తెలంగాణ విముక్తి కోసం పోరాడిన యోధుల త్యాగాలను నేటి తరానికి తెలియజేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మహిళా



మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన స్కూటీ ర్యాలీకి విశేష స్పందన లభించిందని తెలిపారు.కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావుతో కలిసి ర్యాలీలో పాల్గొనడం సంతోషంగా ఉందని రాజ్యలక్ష్మి తెలిపారు. తెలంగాణ చరిత్ర,



పోరాట స్ఫూర్తిని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు భవిష్యత్తులోనూ కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చా నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# శంషాబాద్ ప్రభుత్వ బాలుర పాఠశాలను సందర్శించిన సిద్దు రెడ్డి

- పాఠశాల అభివృద్ధికి అన్నివిధాలా సహకరిస్తానని హామీ

**శంషాబాద్, సెప్టెంబరు 16 (జర్నలిస్ట్ ఫైల్) :**



శంషాబాద్ ప్రభుత్వ బాలుర పాఠశాలను సామాజిక సేవకుడు, ప్రముఖ వ్యాపారవేత్త కందకట్ల సిద్దురెడ్డి సందర్శించి పాఠశాలలోని సమస్యలను పరిశీలించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడి పాఠశాలలో నెలకొన్న మౌలిక వసతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తూ అవసరమైన పనులను చేపడతానని హామీ ఇచ్చారు. పాఠశాల ప్రాంగణంలో బండలు వేయించి విద్యార్థులకు, ఉపాధ్యాయులకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పిస్తామని తెలిపారు. మరుగుదొడ్లు సక్రమంగా లేకపోవడంతో మరమ్మత్తులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. పాఠశాలలో నీటి సమస్యను పరిష్కరించేందుకు నూతన బోరు వేయిస్తానని చెప్పారు. అలాగే పాఠశాల భవనానికి రంగులు వేయించి ఆహ్లాదకరమైన వాతావరణం కల్పిస్తానని పేర్కొన్నారు. విద్యార్థులకు తాగునీటి ఇబ్బందులు లేకుండా ప్యూరిఫైడ్ వాటర్ సదుపాయాన్ని ఏర్పాటు చేస్తానని కందకట్ల సిద్దురెడ్డి తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తుకు పాఠశాల మౌలిక వసతులు ఎంతో కీలకమని, వాటి అభివృద్ధికి అవసరమైన సహకారం అందిస్తానన్నారు. కాగా కందకట్ల సిద్దురెడ్డి కూడా ఇదే ప్రభుత్వ బాలుర పాఠశాలలో విద్యాభ్యాసం చేయడం విశేషం. తాను చదువుకున్న పాఠశాల అభివృద్ధికి తోడ్పడే అవకాశం రావడం ఆనందంగా ఉందని ఆయన పేర్కొన్నారు.

# కౌకూర్‌ను వరద రహిత ప్రాంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యంరూ.9.18 కోట్లతో డ్రైనేజీ పనులు త్వరలో ప్రారంభం : తుడిమెళ్ల మల్లికార్జున్

**నేరేడ్‌మేట్, సెప్టెంబరు 16 (జర్నలిస్ట్ ఫైల్) :**

కౌకూర్ ప్రాంతాన్ని వరద రహితంగా తీర్చిదిద్దడంతో పాటు కాలనీల్లో నెలకొన్న డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యంగా భారీ స్థాయిలో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు మల్కాజిగిరి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, సామాజిక కార్యకర్త తుడిమెళ్ల మల్లికార్జున్ తెలిపారు. ఇందులో భాగంగా రూ.9.18 కోట్లతో చేపట్టనున్న పలు డ్రైనేజీ పనులకు ఇప్పటికే అనుమతులు మంజూరయ్యాయని, త్వరలో పనులు ప్రారంభం కానున్నాయని పేర్కొన్నారు.కౌకూర్‌లోని కింది బస్తీ ప్రాంతాన్ని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత్‌రావు సందర్శించి త్వరలో ప్రారంభం కానున్న బాక్స్ డ్రైన్ పనుల పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా మల్లికార్జున్ మాట్లాడుతూ కౌకూర్ పరిధిలో ప్రజలు ఏళ్లుగా ఎదుర్కొంటున్న వరద, డ్రైనేజీ సమస్యలను గత ఏడాది స్థానిక ప్రజలతో కలిసి మైనంపల్లి హనుమంత్‌రావు దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. సమస్య తీవ్రతను గుర్తించిన ఆయన వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి పనులకు అవసరమైన సహకారం అందించారని చెప్పారు.ప్రస్తుతం ప్రారంభం కానున్న పనుల్లో కింది బస్తీలో బాక్స్ డ్రైన్ నిర్మాణానికి రూ.2.50 కోట్లు, ప్రియదర్శిని ఎన్‌క్లేవ్‌లోని ఉన్న నాలా నుంచి వెన్‌రాగ్ వరకు డ్రైనేజీ పనులకు రూ.4.30 కోట్లు, వెన్‌రాగ్



ఎన్‌క్లేవ్ నుంచి ఓం శ్రీ గ్రాండ్ వరకు పనులకు రూ.2.38 కోట్లు కేటాయించినట్లు మల్లికార్జున్ వివరించారు. మొత్తంగా రూ.9.18 కోట్లతో చేపట్టనున్న ఈ పనులు పూర్తయితే కౌకూర్‌లో వరద సమస్యకు గణనీయమైన పరిష్కారం లభిస్తుందని తెలిపారు.అదేవిధంగా విల్లా ఆర్కిడ్స్, జనప్రియ, ప్రశాంత్ విహార్ కాలనీ తదితర ప్రాంతాల్లో రూ.20 కోట్లకు పైగా అంచనా వ్యయంతో చేపట్టాల్సిన డ్రైనేజీ పనులు ప్రస్తుతం బడ్జెట్ ప్రక్రియలో ఉన్నాయని చెప్పారు. ఈ పనులు కూడా పూర్తయితే ఆయా ప్రాంతాల్లో ఏళ్లుగా కొనసాగుతున్న డ్రైనేజీ, వర్షపు నీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు.ప్రజా సమస్యలను తన సమస్యలుగా భావించి వాటి పరిష్కారానికి మైనంపల్లి హనుమంత్‌రావు ప్రత్యేక చొరవ చూపుతున్నారని మల్లికార్జున్ అన్నారు. భారీ స్థాయిలో నిధులు మంజూరు చేయించి అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్లేందుకు ఆయన చేస్తున్న కృషి అభినందనీయమని తెలిపారు.అనంతరం కౌకూర్ మోడల్ మార్కెట్ భవనాన్ని మైనంపల్లి



హనుమంత్‌రావు సందర్శించారు. మోడల్ మార్కెట్‌ను ప్రజా ప్రయోజనాల కోసం కాపాడేందుకు సహకరిస్తున్నందుకు కౌకూర్ ప్రజలు ఆయనకు ఘన స్వాగతం పలికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జితేంద్రనాథ్, మల్కాజిగిరి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తోట లక్ష్మీకాంత్‌రెడ్డి, మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, మహిపాల్‌రెడ్డి, చిత్ర గోకుల్, బొడ్డి శ్రీనివాస్ యాదవ్, గోకుల్, అల్లి మల్లేష్, పండు, వేణుగౌడ్, సత్తిరెడ్డి, నరేందర్‌రెడ్డి, శివరాజ్, శ్రవణ్, ఆసిఫుల్లా ఖాన్, సయ్యద్ అస్లాం, మహేష్ యాదవ్, కిరణ్, అనురాధ, పుష్ప, వాణితో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కౌకూర్ మోడల్ మార్కెట్ కోసం పోరాటానికి ప్రజల నీరాజనం

- మైనంపల్లి హనుమంత్‌రావు చిత్రపటానికి పాలాభిషేకం..

- మోడల్ మార్కెట్‌ను ప్రజలకు అందుబాటులోకి తేవడంపై హర్షం



**నేరేడ్‌మేట్, సెప్టెంబరు 16 (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రజా ప్రయోజనాల కోసం కౌకూర్ మోడల్ మార్కెట్‌ను పరిరక్షించేందుకు చేసిన పోరాటం ఫలించడంతో స్థానిక ప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. మోడల్ మార్కెట్ భవనాన్ని ఎక్సైజ్ స్టేషన్‌కు కేటాయించాలనే నిర్ణయాన్ని పునః పరిశీలించి, మార్కెట్‌ను తిరిగి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంపై కౌకూర్ ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత్‌రావు చిత్రపటానికి ప్రజలు పాలాభిషేకం చేసి విజయోత్సవాలు నిర్వహించారు.కౌకూర్ ప్రజలకు ఎన్నో సంవత్సరాలుగా ఉపయోగపడుతున్న మోడల్ మార్కెట్ భవనాన్ని ఇతర అవసరాలకు కేటాయించాలనే నిర్ణయం వెలువడటంతో స్థానికుల్లో ఆందోళన నెలకొంది. ప్రజా అవసరాల కోసం నిర్మించిన మార్కెట్‌ను ప్రజలకే అందుబాటులో ఉంచాలనే డిమాండ్‌తో తుడిమెళ్ల మల్లికార్జున్ స్థానిక ప్రజలతో కలిసి సమస్యను ముందుకు తీసుకెళ్లారు. ఈ విషయాన్ని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత్‌రావు దృష్టికి తీసుకెళ్లి, ప్రజల సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు ఆయన సహకారం అందించారని తెలిపారు.ప్రజల సమస్యను తన సమస్యగా భావించిన మైనంపల్లి హనుమంత్‌రావు సంబంధిత అధికారులతో మాట్లాడి మోడల్ మార్కెట్‌ను కాపాడేందుకు తన వంతు సహకారం అందించారని మల్లికార్జున్ పేర్కొన్నారు. ప్రజా ప్రయోజనాలకు భంగం కలగకుండా మార్కెట్‌ను కౌకూర్ ప్రజలకు అందుబాటులో ఉంచేందుకు ఆయన చూపిన చొరవకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా కౌకూర్‌లో నిర్వహించిన విజయోత్సవ కార్యక్రమానికి ప్రజలు భారీగా తరలివచ్చారు. మైనంపల్లి హనుమంత్‌రావు చిత్రపటానికి పాలాభిషేకం చేసి, పూలమాలలు వేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ప్రజా సమస్య పరిష్కారానికి సహకరించిన నాయకుడికి కృతజ్ఞతగా పాలాభిషేకం చేయడం ద్వారా తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. అనంతరం పెద్ద ఎత్తున సంబరాలు నిర్వహించారు.మోడల్ మార్కెట్‌ను పరిరక్షించేందుకు తుడిమెళ్ల మల్లికార్జున్ ప్రజలతో కలిసి ముందుండి చేసిన కృషిని స్థానికులు అభినందించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నాయకత్వం వహిస్తూ, సంబంధిత వర్గాల దృష్టికి సమస్యను తీసుకెళ్లడంలో ఆయన చేసిన కృషి ఫలితంగానే ఈ విజయం సాధ్యమైందని పేర్కొన్నారు."మోడల్ మార్కెట్‌ను కాపాడుకోవడం ఒక్కరి విజయం కాదు.. కౌకూర్ ప్రజలందరి విజయం. ప్రజా ప్రయోజనం కోసం ఐక్యంగా నిలబడి పోరాడితే సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఈ విజయం నిరూపించింది" అని తుడిమెళ్ల మల్లికార్జున్ అన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి మైనంపల్లి హనుమంత్‌రావు అందిస్తున్న సహకారం అభినందనీయమని పేర్కొన్నారు.ప్రజల కోసం మైనంపల్లి హనుమంత్‌రావు చేస్తున్న సేవా కార్యక్రమాలు, వివిధ అభివృద్ధి పనులకు అందిస్తున్న సహకారం తమకు ఎంతో ఉపయోగకరంగా ఉందని స్థానికులు తెలిపారు. కౌకూర్ ప్రాంత అభివృద్ధితో పాటు ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పన, సమస్యల పరిష్కారంలో ఆయన చొరవ చూపుతున్నారని పేర్కొన్నారు. ప్రజల పక్షాన నిలిచి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నందుకు కృతజ్ఞతగా పాలాభిషేకం నిర్వహించినట్లు తెలిపారు.కౌకూర్ మోడల్ మార్కెట్ విషయంలో సాధించిన ఈ విజయం భవిష్యత్తులోనూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం మరింత ఐక్యంగా ముందుకు సాగేందుకు స్ఫూర్తినిస్తుందని మల్లికార్జున్ అన్నారు. కౌకూర్ ప్రజలందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం మైనంపల్లి హనుమంత్‌రావు నాయకత్వంలో ప్రజలతో కలిసి నిరంతరం పనిచేస్తామని స్పష్టం చేశారు.

# ఘనంగా తూళ్ల వీరేందర్ గౌడ్ ఆత్మీయుల సమ్మేళనం

**ఉప్పల్, సెప్టెంబరు 16 (జర్నలిస్ట్ ఫైల్) :**

ఉప్పల్‌లోని శిల్పారామంలో ఆదివారం టీవీజీ సేన ఆధ్వర్యంలో నిర్వహించిన "తూళ్ల వీరేందర్ గౌడ్ ఆత్మీయుల సమ్మేళనం" ఘనంగా జరిగింది. బీజేపీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తూళ్ల వీరేందర్ గౌడ్ అభిమానులు, ఆత్మీయులు, ఆయన తండ్రి, మాజీ హోంమంత్రి దేవేందర్ గౌడ్ అనుచరులు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.దేవేందర్ గౌడ్, తూళ్ల వీరేందర్ గౌడ్‌లతో అనుబంధం కలిగిన అభిమానులు, ఆత్మీయులందరినీ ఒకే వేదికపైకి తీసుకురావాలనే ఉద్దేశంతో ఈ సమ్మేళనాన్ని ఏర్పాటు చేశారు. ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమంలో పలువురు అభిమానులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఇన్నాళ్లుగా కొనసాగుతున్న ఆత్మీయ అనుబంధాలను మరింత బలోపేతం చేసుకోవడంతోపాటు, పరస్పరం కలుసుకుని తమ అనుభవాలను పంచుకునే అవకాశం లభించింది. దేవేందర్ గౌడ్‌తో



తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ పలువురు అభిమానులు ఆయన సేవలను స్మరించుకున్నారు.టీవీజీ సేన ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమ్మేళనం అభిమానులు, ఆత్మీయుల మధ్య ఐక్యతను మరింత పెంపొందించేలా సాగింది.

## ఘనంగా వినాయక చవితి ఉత్సవాలు




- ప్రత్యేక అలంకరణతో అలరిస్తున్న గణనాథుడు
- కాకుమానులో అంకితభావంతో వీర్ల అంకమ్మతల్లి గణేష్ యూత్ వేడుకలు

**కాకుమాను(జర్నలిస్ట్ ఫైల్ ):**వినాయక చవితి ఉత్సవాల సందడిలో కాకుమాను గ్రామం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. శ్రీ శ్రీ పల్నాటి వీర్ల అంకమ్మతల్లి గణేష్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుని ప్రతిమ మరియు దానికి తగినట్లుగా ప్రత్యేకంగా అలంకరించిన మండపం ఈ ప్రాంతంలోనే ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

ఈ వేడుకల విశేషాలపై కమిటీ నిర్వాహకులు మాట్లాడుతూ ప్రజలందరి ఐక్యత, సహకారంతో తాము ఏకంగా గత 28 సంవత్సరాలుగా నిరంతరం గణనాథుడిని ఏర్పాటు చేసుకొని ఎంతో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తూ వస్తున్నట్లు తెలిపారు. తరాలు మారుతున్నా తమ సంప్రదాయాన్ని వీడకుండా ప్రతి ఏటా ఈ వేడుకలను ఘనంగా నిర్వహించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకుంటూ ప్రత్యేక పూజలు చేస్తున్నారు. యువత చేస్తున్న ఈ సేవలను గ్రామస్థులు అభినందిస్తున్నారు.

## గుంటూరులో 11 రోడ్డు కారిడార్లు, 7 జంక్షన్ల అభివృద్ధి



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్ ):** రాష్ట్ర రాజధాని ప్రాంతంలో భాగంగా ఉన్న గుంటూరు నగరాన్ని ఆధునిక వసతులతో అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదించిన రోడ్డు కారిడార్లు, జంక్షన్ల పనులను త్వరితగతిన ప్రారంభించాలని నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ అధికారులను ఆదేశించారు. బుధవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ అధికారులు, ఆంధ్రప్రదేశ్ అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అసెట్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ ప్రతినిధులతో సమన్వయ సమావేశం నిర్వహించారు.

నగరంలో మొత్తం 11 రోడ్డు కారిడార్లను రెండు దశల్లో అభివృద్ధి చేయనున్నట్లు కమిషనర్ తెలిపారు. తొలిదశలో కాకాని రోడ్డు, వీఐపీ రోడ్డు, లక్ష్మీపురం రోడ్డు, కలెక్టరేట్ రోడ్లను అభివృద్ధి చేయనున్నారు. రెండో దశలో అమరావతి రోడ్డు, చిలకలూరిపేట రోడ్డు, ఇన్నర్ రింగ్ రోడ్డు, నల్లచెరువు రోడ్డు, విద్యానగర్ రోడ్డు, పొన్నూరు రోడ్డు, నందివెలుగు రోడ్లను అభివృద్ధి చేయనున్నారు. ప్రతిపాదిత రోడ్డు కారిడార్లలో పచ్చదనం, వీధి దీపాలు, డ్రైనేజీ వ్యవస్థ, వాహనాల పార్కింగ్, ఫుట్‌పాత్‌లు, వీధి వ్యాపార ప్రాంతాలు, డివైడర్లను ప్రణాళికాబద్ధంగా ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.

రోడ్డు కారిడార్లను పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ అధికారులు, ఏపియుఐఎయంఎల్ ప్రతినిధులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పనులకు ఉన్న అడ్డంకులను గుర్తించి వెంటనే పరిష్కరించాలని కమిషనర్ ఆదేశించారు. ఆయా ప్రాంతాల్లో తాగునీటి పైప్‌లైన్ పనులు, మరమ్మతులు, పైప్‌లైన్ మార్పిడి పనులు ఉంటే తక్షణమే పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. ఆక్రమణలను గుర్తించి తొలగించే చర్యలు చేపట్టాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. నగరంలోని ఏడు ప్రధాన జంక్షన్ల అభివృద్ధికి కూడా ఏపియుఐఎయంఎల్ ప్రతిపాదనలు సిద్ధం చేసిందని, వాటి పనులను సైతం త్వరగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో సిటీ ప్లానర్ రాంబాబు, ఎస్ఈ సుందర్రామిరెడ్డి, డీసీపీ సూరజ్‌కుమార్, ఈఈలు విష్ణుమూర్తి, వేణుగోపాల్, ఏసీపీలు రెహమాన్, జకీరా, డీఈఈలు, టీపీబీవోలు, ఏఈలు, ఏపియుఐఎయంఎల్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## సార్వత్రిక రోగనిరోధక కార్యక్రమం



**బాపట్ల జిల్లా (జర్నలిస్ట్ ఫైల్ ):**వేదుళ్ళపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అసూదివారిపాలెం వద్ద నిర్వహించిన సార్వత్రిక రోగ నిరోధక కార్యక్రమ సెషన్‌ను జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి డాక్టర్ విజయమ్మ సందర్శించారు. ఈ పర్యటనలో భాగంగా ఆమె అక్కడ అందుతున్న వైద్య సేవలను స్వయంగా పరిశీలించారు. ఏఎన్ఎంలు, ఆరోగ్య సిబ్బందితో మాట్లాడి, ప్రస్తుతం కొనసాగుతున్న వ్యాక్సినేషన్ ప్రక్రియ తీరును అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలో రికార్డుల నిర్వహణ, మాతా శిశు సంక్షేమ పనులు, టీకాలు మరియు ఇతర వస్తువుల లభ్యతపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. అనంతరం అక్కడకు వచ్చిన తల్లులతో డాక్టర్ విజయమ్మ ముచ్చటించారు. పిల్లలకు సరైన సమయానికి టీకాలు వేయించడం ఎంత ముఖ్యమో వారికి వివరించారు. నిర్ణీత షెడ్యూల్ ప్రకారం అన్ని టీకాలను పూర్తి చేయించాలని, తదుపరి టీకాల కోసం పిల్లలను క్రమం తప్పకుండా ఆరోగ్య కేంద్రానికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు , సిబ్బంది పాల్గొని, అవసరమైన సమాచారాన్ని అందించారు.

# తాగునీటి సరఫరాలో నిర్లక్ష్యాన్ని సహించం

- మంచినీళ్లు లేకపోతే ఎలా బతుకుతారు
- కనీస అవసరాలు కూడా తీర్చలేరా
- యుద్ధప్రాతిపదికన మంచినీటి సరఫరా చేపట్టండి
- చంద్రబాబు నాయుడు కాలనీని పరిశీలించిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్ ):** ప్రజలకు తాగునీరు అందించడంతో అధికారులు ఎలాంటి అలసత్వం వహించినా సహించం. ఎన్నో రోజులుగా చంద్రబాబు నాయుడు కాలనీ వాసులు మంచినీరు లేక గొంతెండుతుంటే ఏం చేస్తున్నారు ? ప్రజలకు మంచినీళ్లు లేకపోతే ఎంత ఇబ్బందులు పడతారో తెలియదా ? ప్రజలకు అత్యవరసమైన విషయాల్లో అశ్రద్ధ చేస్తే మాత్రం ఊరుకునే ప్రస్తక్తి లేదు అని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక చంద్రబాబు నాయుడు కాలనీలో మంచినీళ్లు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే నసీర్ కు సమాచారం రావడంతో మంగళవారం ఉదయం వెనువెంటనే ఆ ప్రాంతానికి వెళ్లారు. స్థానిక ప్రజలతో మాట్లాడి ఏ సమయంలో మంచినీళ్లు వస్తున్నాయి ? ఎంత సేపు వస్తున్నాయి ? అసలు ఎన్నిరోజుల నుంచి నిలిచిపోయాయి ? వంటి అంశాలపై ఆరా తీశారు. మంచినీటి అవసరాలకు ప్రత్యామ్నాయంగా ఎలాంటి చర్యలు తీసుకున్నారని అడిగి తెలుసుకున్నారు. అనంతరం చంద్రబాబు నాయుడు కాలనీలో మంచినీటి సమస్య పరిష్కారానికి యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. మంచినీటి సరఫరాలో ఎక్కడ లోపం ఉందో గుర్తించాలన్నారు. పైపులైన్లను సక్రమంగా పరిశీలించి, ఇబ్బందులు రాకుండా చూడాలని ఆదేశించారు. చంద్రబాబు నాయుడు కాలనీలో పైపులైన్ల ఏర్పాటు అవసరమైన స్థలాన్ని పరిశీలించి సేకరించాలని సూచించారు. నియోజకవర్గంలో ఎక్కడా మంచినీటి సమస్య తలెత్తినా సహించబోమని హెచ్చరించారు. చంద్రబాబు నాయుడు కాలనీలో రోడ్ల పరిస్థితిపై ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నామని, రోడ్ల నిర్మాణం చేపడతామని తెలిపారు. రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావం కారణంగా వర్షాలు లేకపోయినప్పటికీ ఎక్కడా మంచినీటి సమస్య రాకుండా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. గృహాలకు సరఫరా అయ్యే నీటిని నాలుగు పద్ధతుల్లో క్లోరినేషన్ చేస్తున్నామని తెలిపారు. ప్రజలకు మంచినీటి సమస్య ఎక్కడ తలెత్తినా వెంటనే తమ కార్యాలయాన్నిగానీ, తనను స్వయంగాగానీ సంప్రదించాలని సూచించారు.

# కార్పొరేషన్ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి క్లీన్ స్వీప్ చేయాలి

- ఈ రెండు ఏళ్లలోనే ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేశాం
- గర్వంగా ప్రజలను ఓటు అడుగుదాం
- పార్టీ శ్రేణులు ఇప్పటి నుంచే సిద్ధంగా ఉండాలి - ఎమ్మెల్యే గళ్ళా మాధవి



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్ ):** రానున్న మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి క్లీన్ స్వీప్ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఈ రెండు ఏళ్లలోనే ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేశాం కాబట్టి గర్వంగా ప్రజలను ఓటు అడుగుదామని, దానికి పార్టీ శ్రేణులు ఇప్పటి నుంచే సిద్ధంగా ఉండాలని, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి సూచించారు. బుధవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే శ్రీమతి గళ్ళా మాధవి కార్యకర్తల గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించి, పార్టీ శ్రేణుల నుంచి నేరుగా అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ డివిజన్లకు చెందిన కార్యకర్తలు తమ ప్రాంతాల్లోని సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వెంటనే స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ గతంలో వైసీపీ కార్పొరేటర్లు అభివృద్ధిని, ప్రజలను విస్మరించి, దోపిడికి పాల్పడ్డారని విమర్శించారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో అభివృద్ధినే లక్ష్యంగా పెట్టుకుని కోట్లాది రూపాయలతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. రహదారులు, డ్రైనేజీ, మౌలిక సదుపాయాల కల్పనతో పాటు ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. రానున్న మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ఈ రెండు ఏళ్లలోనే ఎన్నో చేశాం గర్వంగా ఓటు అడుగుదాం అని, ఎన్డీయే కూటమి క్లీన్ స్వీప్ చేసేలా పార్టీ శ్రేణులు ఇప్పటి నుంచే సిద్ధంగా ఉండాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పిలుపునిచ్చారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు పార్టీ బలోపేతానికి సమష్టిగా పనిచేయాలని పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే గళ్ళా మాధవి పిలుపునిచ్చారు.

# ఆరోగ్యశాఖ కాంట్రాక్టు ఉద్యోగుల మౌన నిరసన



**బాపట్ల జిల్లా (జర్నలిస్ట్ ఫైల్ ):**తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ వైద్య ఆరోగ్యశాఖ కాంట్రాక్టు ఉద్యోగులు వినూత్న రీతిలో మౌన నిరసన చేపట్టారు. బుధవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో బాపట్ల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయం ఎదుట బాపట్ల జిల్లా ఆరోగ్యశాఖ కాంట్రాక్టు ఉద్యోగుల జేఏసీ సభ్యుడు సత్యం రాజు కూరపాటి ఆధ్వర్యంలో ఉద్యోగులు నోటికి నల్ల రిబ్బన్లు ధరించి నిరసన తెలిపారు.

ఉద్యోగులు నోటికి నల్ల రిబ్బన్లు ధరించి ఎలాంటి నినాదాలు చేయకుండా మౌనంగా కూర్చొని తమ ఆవేదనను వ్యక్తం చేశారు.

"ప్రజల ఆరోగ్యం కోసం సేవ చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల ఆవేదనను ప్రభుత్వం ఆలకించి న్యాయం చేయాలి." ఇప్పటికీ మేము రోగులను దేవుళ్ళలా భావించి సేవలకు విఘాతం కలుగకుండా సేవలను అందిస్తున్నాం అంటూ తమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం స్పందించాలని కోరారు.

"ప్రజలకు సేవ చేస్తున్న మమ్మల్ని కూడా గుర్తించాలి"

వైద్య ఆరోగ్యశాఖలో కాంట్రాక్టు ఉద్యోగులు నిరంతరం ప్రజలకు వైద్య సేవలు అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని తమ సేవలను ప్రభుత్వం గుర్తించి న్యాయమైన డిమాండ్లపై సానుకూలంగా స్పందించాలని ఉద్యోగులు కోరారు. ఈ నిరసన కార్యక్రమానికి రెగ్యులర్ ఫార్మసిస్టుల అసోసియేషన్ తరఫున వల్లంశెట్టి శ్రీనివాసరావు సంఘీభావం ప్రకటించి నిరసనలో పాల్గొన్నారు. కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తమ మద్దతు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో స్టాఫ్ నర్స్ తబిత, ఫార్మసిస్టులు శాంతిమనోజ, నళిని, బయోమెడికల్ ఇంజనీర్ నళినీకుమారి, ల్యాబ్ టెక్నీషియన్లు సునీత, నీలిమ బహాటం పాల్గొన్నారు.


## 17న కొల్లిపరలో ఒక నెల - ఒక నియోజకవర్గం - నాలుగు సందర్శనలు కార్యక్రమం

**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్ ):** ఒక నెల - ఒక నియోజకవర్గం - నాలుగు సందర్శనలు కార్యక్రమాన్ని గురువారం కొల్లిపరలో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కొల్లిపరలో జగన్నాథ స్వామి ఆలయం ఎదురుగా గురువారం ఉదయం 10.30 గంటలకు ప్రారంభం అవుతుందని చెప్పారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి మరియు స్థానిక శాసన సభ్యులు నాదెండ్ల మనోహర్, జిల్లా అధికారులు, నియోజక వర్గంలోని మండల అధికారులు పాల్గొంటారని తెలిపారు. తమ సమస్యలను ప్రజా ప్రతినిధులు, అధికారుల కు అందజేయవచ్చని జిల్లా కలెక్టర్ వివరించారు.

## 18న జిల్లా స్థాయి బ్యాంకర్‌ల సమావేశం

**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్ ):** జిల్లా స్థాయి బ్యాంకర్ ల సమావేశం ఈ నెల 18వ తేదీన నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సి. యం. సాయికాంత్ వర్మ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బ్యాంకర్ ల సమావేశం 18వ తేదీ మధ్యాహ్నం 1.30 గంటల నుండి ఎస్. ఆర్. శంకరన్ సమావేశ మందిరంలో జరుగుతుందని అన్నారు. కేంద్ర కమ్యూనికేషన్లు, గ్రామీణ అభివృద్ధి శాఖ సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్ర శేఖర్, జిల్లా ఇన్ ఛార్జ్ మంత్రి మంత్రి కందుల దుర్గేష్ హాజరు కానున్నారని తెలిపారు.

# జిల్లాలో పెద్ద ఎత్తున 'స్వచ్ఛతా హీ సేవా 2026'



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్ ):** జిల్లాలో పెద్ద ఎత్తున 'స్వచ్ఛతా హీ సేవా 2026' కార్యక్రమాన్ని నిర్వహించుటకు సిద్ధమైనట్లు జిల్లా కలెక్టర్ సి. యం. సాయికాంత్ వర్మ తెలిపారు. స్వచ్ఛతా హీ సేవా 2026'పై రాష్ట్ర పురపాలక, పట్టణ అభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్ బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 'స్వచ్ఛతా హీ సేవా 2026' కార్యక్రమం సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 2 వరకు నిర్వహించుట జరుగుతుందన్నారు.

ఈ ఏడాది ప్రచార కార్యక్రమం 'స్వచ్ఛతా మెయిన్ సహభాగ్; స్వచ్ఛ భారత్, విక్షిత్ భారత్' అనే నినాదంతో 'హోల్ ఆఫ్ సొసైటీ', 'హోల్ ఆఫ్ గవర్నమెంట్' విధానంలో పౌరులు, సంస్థలు, నాయకత్వాన్ని ఏకతాటి పైకి తీసుకువచ్చే విధంగా రూపొందించడం జరిగింది. దీని పట్ల ఈ కార్యాచరణ ప్రణాళికను రూపొందించామన్నారు. పరిశుభ్రత లక్ష్యం గల ప్రాంతాలలో మార్పు తీసుకురావడం, పరిశుభ్రమైన బహిరంగ ప్రదేశాలు, స్వచ్ఛ పాఠశాల -- యువత భాగస్వామ్యం, సఫాయి మిత్ర సురక్ష ఏవం సమ్మాన్ శిబిరాలు, స్వచ్ఛత కోసం జన భాగీదారి స్వచ్ఛతా సే సమృద్ధి ప్రచారంలో భాగంగా జిల్లావ్యాప్తంగా మురికి, నిర్లక్ష్యానికి గురైన ప్రాంతాలను గుర్తించి నిర్ణీత గడువులోగా వాటిని పరిశుభ్రపరచడం, పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు వ్యర్థాల యాజమాన్యంపై అవగాహన కల్పించడం, పారిశుధ్య కార్మికులకు (సఫాయి మిత్రలకు) ఆరోగ్య పరీక్షలు, రక్షణ పరికరాలు, సంక్షేమ పథకాల అనుసంధానంతో ప్రత్యేక శిబిరాలు నిర్వహించడం, ఇంటింటికీ అవగాహన కార్యక్రమాలు, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, గృహ కంపోస్టింగ్‌ను ప్రోత్సహించడం వంటి కార్యక్రమాలు చేపట్టనున్నామన్నారు. ఈ ప్రచార కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని, స్వచ్ఛతను నిత్యజీవనంలో ఒక భాగంగా మలచుకోవాలని కోరారు.

ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్ మాట్లాడుతూ అక్టోబర్ 1వ తేదీన ఉదయం 8 గంటలకు దేశవ్యాప్తంగా 'ఏక్ దిన్, ఏక్ ఘంటా, ఏక్ సాథ్' పేరుతో సామూహిక శ్రమదానం నిర్వహించుటకు ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పౌరులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, పాఠశాలలు, యువజన సంఘాలు పెద్ద ఎత్తున పాల్గొనే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.

అక్టోబర్ 2వ తేదీన 'స్వచ్ఛ భారత్ దివస్' సందర్భంగా గ్రామ పంచాయతీలలో ప్రత్యేక గ్రామసభలు, పట్టణ ప్రాంతాల్లో ప్రత్యేక కౌన్సిల్ సమావేశాలు నిర్వహించి, ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణ నిబంధనలు--2026పై అవగాహన కల్పించడంతోపాటు 'ఏక్ పేడ్ మా కే నామ్' కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటలన్నారు.

ప్రచార కార్యక్రమానికి సంబంధించిన రోజువారీ కార్యకలాపాలను ప్రత్యేకంగా రూపొందించిన ఐటీ పోర్టల్ లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్ లో గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ కె.మయూర్ అశోక్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## క్షేత్రస్థాయిలో విజిబుల్ పోలీసింగ్ మరింత పటిష్ఠం



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్ ):** జిల్లా వ్యాప్తంగా శాంతిభద్రతలను పరిరక్షిస్తూ సామాన్య ప్రజలకు భద్రత, భరోసా కల్పించడమే లక్ష్యంగా క్షేత్రస్థాయిలో విజిబుల్ పోలీసింగ్‌ను మరింత పటిష్ఠంగా అమలు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. ఆయన ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రధాన కూడళ్లు, వ్యాపార సముదాయాలు, జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాలు, ఆసుపత్రులు, బ్యాంకులు, బస్టాండ్లు, విద్యాసంస్థలు, ఇతర సున్నిత ప్రాంతాల్లో పోలీసు అధికారులు, సిబ్బందిని అందుబాటులో ఉంచి నిరంతరం నిఘా కొనసాగిస్తున్నారు.

గణేష్ ఊరేగింపుల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు అవకాశం లేకుండా పగలు, రాత్రి ప్రత్యేక పోలీసు బృందాలతో విస్తృతంగా పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. అనుమానాస్పద కదలికలు, సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి ముందస్తు చర్యలు చేపడుతున్నారు. బ్యాంకులు, వ్యాపార సముదాయాల వద్ద దొంగతనాలు, దోపిడీలను అరికట్టడంతో పాటు విద్యాసంస్థల పరిసరాల్లో ఆకతాయిల వేధింపులను నిరోధించేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. అల్లర్లు, గొడవలు, అక్రమ నిర్బంధాలు, కిడ్నాప్‌లు, మానవ అక్రమ రవాణా వంటి నేరాలను అడ్డుకునేందుకు చర్యలు తీసుకుంటున్నారు. కీలక ప్రాంతాల్లో ఆకస్మిక వాహన తనిఖీలు నిర్వహిస్తూ వాహన చోరీలు, గంజాయి, ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ప్రత్యేక బృందాలతో తనిఖీలు చేపడుతున్నారు.

అనుమానిత వ్యక్తులు, వాహనాల వివరాలను సేకరించి సాంకేతిక పరిజ్ఞానం ద్వారా పరిశీలిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. రాత్రి వేళల్లో అనుమానాస్పదంగా సంచరించే వ్యక్తుల వివరాలను సేకరించి, సీసీటీఎన్ఎస్, పోలీస్ శాఖ డేటాబేస్ ద్వారా వారి పూర్వ నేర చరిత్రను పరిశీలిస్తున్నారు. గుంటూరు నగరం, జిల్లాలోని ముఖ్య ప్రాంతాలను ఎస్పీ స్వయంగా పరిశీలించి అవసరమైన చోట అదనపు నిఘా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. రౌడీషీటర్లు, గంజాయి కేసుల్లో నిందితుల కదలికలపై ఆర్టీజీఎస్, ఏఐ సీసీటీవీ 360 వంటి సాంకేతిక వ్యవస్థల ద్వారా నిరంతర నిఘా కొనసాగుతోందని తెలిపారు. అవసరమైన సందర్భాల్లో డ్రగ్ టెస్టులు నిర్వహిస్తూ మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజల భద్రతకు విఘాతం కలిగించే వారిని, శాంతిభద్రతలకు భంగం కలిగించే వ్యక్తులను, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని, చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. ప్రజల భద్రతే పోలీసుల ప్రథమ కర్తవ్యమని, ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా పోలీసు సేవలు నిరంతరం అందుబాటులో ఉంటాయని తెలిపారు.

## సత్య కుమార్ పుట్టినరోజు సందర్భంగా మఠంలో ప్రత్యేక పూజలు



**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్ ):**రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రివర్యులు వైవి సత్య కుమార్ యాదవ్ జన్మదిన శుభ సందర్భంగా శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాములవారి మఠం నందు భారతీయ జనతా పార్టీ బ్రహ్మంగారిమఠం అధ్యక్షులు పెద్దిరెడ్డి చంద్ర ఓబుల్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బుసిటి సుధాకర్ కటారు వెంకటరమణ పోలు అంకిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బ్రహ్మంగారిమఠం అభివృద్ధికి శ్రీకారం



- నూతన షెడ్డు నిర్మాణానికి ఏర్పాట్లు

**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్ ):**జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి మఠం అభివృద్ధికి మఠాధిపతులు శ్రీ శ్రీ శ్రీ వీర ధర్మజ వెంకటాద్రి స్వాముల వారు శ్రీకారం చుట్టారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మఠాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నారు. ఇందులో భాగంగా మఠం ఆలయ ప్రాంగణంలో ఉన్న పాత రేకుల షెడ్డును తొలగించి, ఖాళీ ప్రదేశంలో గాల్వనైజ్డ్ రేకులతో నూతన షెడ్డును నిర్మించాలని నిర్ణయించారు. ఈ నిర్మాణానికి కర్ణాటక రాష్ట్రం, బళ్లారి జిల్లా, చల్లకెరెకు చెందిన దాత విజయ్ గుప్తా వారి కుటుంబ సభ్యులు ముందుకు వచ్చారు. వారి సొంత నిధులతో ఈ షెడ్డును నిర్మించి ఇస్తామని మఠాధిపతుల వారికి విన్నవించారు. దాతల విజ్ఞప్తికి మఠాధిపతులు అంగీకారం తెలిపారు. దీంతో అతి త్వరలోనే ఈ నూతన షెడ్డు నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి. బుధవారం ఇంజనీరింగ్ విభాగం అధికారులతో కలిసి మఠాధిపతులు స్వయంగా స్థలాన్ని పరిశీలించి, ఎస్టిమేషన్లు రూపొందించారు. దాత పర్యవేక్షణలోనే ఈ పనులు చేపట్టనున్నారు. భక్తులు మఠం అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని సహకరించవలసిందిగా మఠం వర్గాలు కోరాయి.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## వైకుంఠపురం దేవస్థాన అభివృద్ధికి కృషి చేయాలి



- నూతన పాలకవర్గానికి ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ సూచన

**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్ ):** వైకుంఠపురం దేవస్థానానికి నూతనంగా నియమితులైన పాలకవర్గం ఆలయంలోని సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని శాసనమండలి సభ్యుడు, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ సూచించారు. తెనాలిలో నిర్వహించిన వైకుంఠపురం దేవస్థాన నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రమాణ స్వీకారం చేసిన పాలకవర్గ సభ్యులను ఘనంగా సత్కరించారు. ఆలయానికి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు నూతన పాలకవర్గం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.

దేవస్థాన చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన ఈదర వెంకట పూర్ణచంద్ మాట్లాడుతూ కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, శాసనమండలి సభ్యుడు, తెనాలి తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి ఆలపాటి రాజేంద్రప్రసాద్, రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ ఆశీస్సులతో ఆలయ అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తామని తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన సౌకర్యాలను మెరుగుపరుస్తామని పేర్కొన్నారు. ఆలయ అభివృద్ధికి పాలకవర్గం సమష్టిగా పనిచేయాలని పలువురు ప్రముఖులు సూచించారు. దప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముందు అయితానగర్‌లోని పేరంటాలమ్మ ఆలయం నుంచి పట్టణంలోని బోస్ రోడ్డు మీదుగా వైకుంఠపురం దేవస్థానం వరకు నూతన పాలకవర్గం భారీ ర్యాలీ నిర్వహించింది. అనంతరం దేవస్థానంలో ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో మాజీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి, తెలుగుదేశం పార్టీ నాయకులు అప్పసాని రాజేష్, జనసేన పార్టీ జిల్లా నాయకుడు కార్య వెంకటేశ్వరరావు, తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షుడు మొహమ్మద్ కూద్దుస్, సాంబిరెడ్డి, కేసన కోటేశ్వరరావు, మహేష్ అశోకవర్ధనం, కంచర్ల ఏడుకొండలు, మల్లవరపు విజయ్‌కుమార్, మహిళా నాయకులు రమ్య, అనిత, రూపమధు, రమాదేవి, దేవస్థాన పాలకవర్గ సభ్యులు, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సర్వైవల్ క్యాన్సర్ పై అప్రమత్తత అవసరం



- గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్
- జీజీహెచ్ లో ఉచిత వైద్య పరీక్షలు

**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్ ):** సర్వే క్యాన్సర్ పై మహిళలు అప్రమత్తంగా ఉండాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నర్సింగ్ సూచించారు గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం మహిళలకు ఉచిత సర్వైవల్ క్యాన్సర్ పరీక్షలో నిర్వహించారు కార్యక్రమానికి ఎమ్మెల్యేల ముఖ్యఅతిథిగా హాజరయ్యారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సర్వైకల్ క్యాన్సర్‌ను నిరోధించడంలో హెచ్ పీవీ వ్యాక్సిన్ అత్యంత ప్రభావవంతంగా పని చేస్తుందని తెలిపారు. 9 నుండి 14 సంవత్సరాల వయసున్న బాలికలకు ఇది తప్పనిసరని తెలిపారు. 21-25 సంవత్సరాలు దాటిన ప్రతి మహిళా క్రమం తప్పకుండా స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో సర్వైవల్ క్యాన్సర్ పరీక్షలు ఉచితంగా నిర్వహించడం అభినందనీయమని చెప్పారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి మహర్దశ తీసుకొచ్చామన్నారు. అన్ని విభాగాలను బలోపేతం చేస్తూ పేదలకు కార్పొరేట్ వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. నాట్కో క్యాన్సర్ సెంటర్ లో పెట్ స్కానింగ్ కూడా పేదలకు అందిస్తున్నట్లు తెలిపారు. క్యాన్సర్‌కు గతంలో ప్రతి ఒక్కరూ భయపడే వారిని, ఇప్పుడు ప్రభుత్వమే ఉచితంగా వైద్య సేవలు అందిస్తుందని చెప్పారు. ఓపీ నుంచి అన్ని విభాగాలనూ బలోపేతం చేస్తుజ రోగులకు అవసరమైన సౌకర్యాలు గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో కల్పించామని తెలిపారు. వీటిని పేదలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గైనకాలజిస్ట్ అరుణ, సూపరింటెండెంట్ దుర్గాప్రసాద్, వైద్యులు పాల్గొన్నారు.

## 20న ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం

**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్ ):** ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ 18వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం ఈ నెల 20న విజయవాడ లెనిన్ సెంటర్‌లోని రెవెన్యూ భవన్‌లో నిర్వహించనున్నట్లు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం ఉదయం 9 గంటలకు సంఘం జెండా ఆవిష్కరణ, కా. తోట సుధాకర్ ప్రసాద్ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసే కార్యక్రమాలతో సమావేశం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగే సమావేశానికి రాష్ట్రంలోని అన్ని డివిజన్ల అధ్యక్ష, కార్యదర్శులు, అన్ని జిల్లాల కార్యవర్గ సభ్యులు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హాజరుకానున్నారు.

**అదే రోజు రాష్ట్ర సంఘం ఎన్నికలు**

సంఘం రాష్ట్ర కార్యవర్గం మూడేళ్ల పదవీకాలం ఈ నెల 29తో ముగియనున్న నేపథ్యంలో 2026--2029 కాలానికి నూతన రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకోనున్నారు. ఇప్పటికే రాష్ట్రంలోని 26 జిల్లాల ఎన్నికలు పూర్తయ్యాయని తెలిపారు. ఎన్నికల అధికారి పీవీ కృష్ణారావు సెప్టెంబరు 4న ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసినట్లు వెల్లడించారు. రాష్ట్ర కార్యవర్గంలో అధ్యక్షుడు ఒకరు, అసోసియేట్ అధ్యక్షుడు ఒకరు, ఉపాధ్యక్షులు ఎనిమిది మంది, జనరల్ సెక్రటరీ ఒకరు, క్రీడలు, సాంస్కృతిక కార్యదర్శులు ఇద్దరు, కార్యదర్శులు ఎనిమిది మంది, ఆర్గనైజింగ్ సెక్రటరీలు ఎనిమిది మంది, కోశాధికారి ఒకరు కలిపి మొత్తం 30 మంది ఎన్నిక కానున్నారు. ఉపాధ్యక్షులు, క్రీడలు, సాంస్కృతిక కార్యదర్శులు, కార్యదర్శులు, ఆర్గనైజింగ్ సెక్రటరీల పదవుల్లో నిబంధనల ప్రకారం మహిళలకు కొన్ని స్థానాలు రిజర్వ్ చేశారు. సెప్టెంబరు 20న రెవెన్యూ భవన్‌లో ఉదయం 10.30 గంటలకు నామినేషన్ పత్రాల జారీతో ఎన్నికల ప్రక్రియ ప్రారంభమవుతుందని ఎన్నికల అధికారి పీవీ కృష్ణారావు తెలిపారు. అనంతరం నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, జాబితా ప్రచురణ, ఉపసంహరణ ప్రక్రియ కొనసాగుతుందని చెప్పారు. మధ్యాహ్నం 1.30 గంటలకు తుది అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తామని, పోటీ ఉన్న పక్షంలో సాయంత్రం 4 గంటల నుంచి ఎన్నికలు నిర్వహించి అదే రోజు ఫలితాలను వెల్లడిస్తామని తెలిపారు. ఎన్నికైన నూతన కార్యవర్గంతో అదే రోజు జరిగే రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో ప్రమాణ స్వీకారం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

## 19 కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు అందజేత



- ఎమ్మెల్సీ ఆలపాటి చొరవతో రూ.23.06 లక్షల ఆర్థిక సాయం

**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్ ):** తెనాలి నియోజకవర్గానికి చెందిన 19 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.23,06,643 ఆర్థిక సహాయానికి సంబంధించిన చెక్కులను నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ, మాజీ మంత్రి, నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి ఆలపాటి రాజేంద్రప్రసాద్ బుధవారం అందజేశారు. ఆయన చొరవ, ప్రత్యేక సహకారంతో ఈ ఆర్థిక సాయం మంజూరైనట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఆపద సమయంలో ప్రజలను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఆర్థిక సాయం అందిస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా ఖరీదైన వైద్య చికిత్సలు చేయించుకునే కుటుంబాలకు ఈ సహాయం ఆర్థికంగా ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. వైద్య ఖర్చుల భారాన్ని కొంతమేర తగ్గించేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధి అండగా నిలుస్తోందని తెలిపారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సాయం పొందిన లబ్ధిదారుల కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, తమకు సహకరించిన ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పిల్లి మాణిక్యరావు, పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ కుద్దూస్, సాంబిరెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎన్‌ఆర్‌ఐ ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకురాలు చైతన్యకు పీహెచ్‌డీ



**మేడికొండూరు (జర్నలిస్ట్ ఫైల్ ):** మేడికొండూరు సమీపంలోని ఎన్‌ఆర్‌ఐ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో అధ్యాపకురాలిగా పనిచేస్తున్న చెన్నుపాటి చైతన్య గణితశాస్త్రంలో పీహెచ్‌డీ డిగ్రీకి అర్హత సాధించారు. కుప్పంలోని ద్రావిడియన్ విశ్వవిద్యాలయం గణితశాస్త్ర విభాగంలో పరిశోధకురాలిగా కొనసాగిన ఆమె 'ఆల్ఫా--క్లోజ్డ్ సెట్స్ మరియు వాటి విభజన స్వీకారాలు' అనే అంశంపై పరిశోధన చేసి సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించారు. పరీక్షకుల మండలి సమర్పించిన నివేదికలను విశ్వవిద్యాలయం ఆమోదించడంతో సెప్టెంబరు 10, 2026 నుంచి గణితశాస్త్రంలో పీహెచ్‌డీ డిగ్రీ ప్రదానానికి ఆమె అర్హత సాధించారు.

తమిళనాడు రాష్ట్రం కరూర్ జిల్లా తారగంపట్టి ప్రభుత్వ కళలు, విజ్ఞానశాస్త్ర సహవిద్య కళాశాల తాత్కాలిక ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. బాలసుబ్రమణియన్ పరిశోధనా పర్యవేక్షణలో చైతన్య తన పరిశోధనను విజయవంతంగా పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఎన్‌ఆర్‌ఐ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ డాక్టర్ డి. సంజయ్ ఆమెను అభినందించారు. పరిశోధనా రంగంలో చైతన్య సాధించిన విజయాన్ని ప్రశంసిస్తూ, భవిష్యత్తులో మరిన్ని పరిశోధనా విజయాలు సాధించి విద్యా రంగానికి, సంస్థకు సేవలందించాలని ఆకాంక్షించారు.

చైతన్యకు పీహెచ్‌డీ లభించడంపై కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. శాసనమండలి సభ్యుడు, చీఫ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తిలక్ బాబు, ఎస్ఎన్‌హెచ్ విభాగాధిపతి కేఎస్ఆర్ తదితరులు డాక్టర్ చైతన్యను ప్రత్యేకంగా అభినందించారు. ఆమె భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి పరిశోధన, విద్యా రంగాల్లో విశిష్ట సేవలు అందించాలని ఆకాంక్షించారు.

## ఎయిడెడ్ టీచర్ల సర్దుబాటు కౌన్సెలింగ్ నిలిపివేయాలి

- ఎస్సీ,ఎస్టీ ఉద్యోగుల సంఘం వినతికి సానుకూలంగా స్పందించిన డీఈవో సుబ్బారావు



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్ ):** విద్యా సంవత్సరం మధ్యలో టీచర్ల సర్దుబాటుతో పాఠశాలల్లో నిరుపేద విద్యార్థులు చదువులకు ఆటంకాలు కలుగుతాయని అందువల్ల టీచర్ల సర్దుబాటు ప్రక్రియ నిలిపి వేయాలని ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి సురేష్ బాబు కోరారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారిక యూ వి సుబ్బారావు కు వినతి పత్రం అంద చేశారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలో దాదాపు వివిధ యాజమాన్యాల కింద పనిచేస్తున్న 44 మంది ఉపాధ్యాయ సర్దుబాటు ప్రక్రియ కొరకు జిల్లా విద్యాశాఖ ఇచ్చిన ఉత్తర్వులతో డీఈఓ కార్యాలయానికి ఉపాధ్యాయులు వచ్చారు. ఉపాధ్యాయులకు మద్దతు గా కార్యాలయానికి వచ్చిన సురేష్ బాబు మాట్లాడుతూ విద్యా సంవత్సరం మధ్యలో కౌన్సిలింగ్ నిర్వహించి టీచర్ల సర్దుబాటు చేయడం వల్ల పదవ తరగతి విద్యార్థుల చదువులకు ఆటంకాలు కలుగుతాయని, క్షేత్రస్థాయిలో పాఠశాలలకు లాభం కంటే నష్టమే జరిగే అవకాశం ఉందని సురేష్ బాబు పేర్కొన్నారు. ఉపాధ్యాయులు దీర్ఘకాలిక సమస్యలు తోపాటు ఇతర అనారోగ్య పరిస్థితుల్లో ఆకస్మాత్తుగా దూరాలకు బదిలీ చేయడంతో ఆ ప్రభావం విద్యార్థుల చదువులు పై పడతాయన్నారు. పాఠశాలలో వివిధ విద్యా కార్యక్రమాలు,స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ ఎన్నికలు ఇతర బోధనేతర కార్యక్రమాలతో టీచర్లు నిమగ్నమైన సమయంలో సర్దుబాటు ప్రక్రియ సరికాద న్నారు.సంఘ నేతల వినతులను పరిగణనలోనికి తీసుకొని సర్దుబాటు ప్రక్రియను తాత్కాలికంగా నిలిపి వేసినట్లు డిఇఓ సుబ్బారావు తెలిపారు

ఈసందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి సురేష్‌బాబు, ఉపాధ్యాయులు విద్యాశాఖ అధికారికి కృతజ్ఞతలు తెలియజేశారు.

## సచివాలయ కో-ఆపరేటివ్ క్యాంటీన్‌లో వినాయకుడి లడ్డూ వేలం

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్ ):** ఆంధ్రప్రదేశ్ సచివాలయ కో-ఆపరేటివ్ క్యాంటీన్‌లో వినాయక నిమజ్జనం సందర్భంగా బుధవారం స్వామివారి లడ్డూ వేలంపాట నిర్వహించారు. కో-ఆపరేటివ్ క్యాంటీన్ అధ్యక్షుడు దుర్గాప్రసాద్ బృందం, ఆంధ్రప్రదేశ్ సచివాలయ అసోసియేషన్ అధ్యక్షుడు రామకృష్ణ బృందం ఆధ్వర్యంలో వేలంపాట ఉత్సాహంగా సాగింది.

వేలంపాటలో అసెంబ్లీ ఎస్‌వో శశికళ రూ. 1.20 లక్షలకు స్వామివారి లడ్డూను దక్కించుకున్నారు. ఈ సందర్భంగా సచివాలయ ఉద్యోగులు, క్యాంటీన్ సిబ్బంది, అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.



## యువతలో చర్చా నైపుణ్యాలకు 'వాద్-వివాద్ 2026' వేదిక



**విజయవాడ గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్ ):** దేశ నిర్మాణంపై యువత తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా, తార్కికంగా వ్యక్తీకరించేలా ప్రోత్సహించేందుకు నిర్వహిస్తున్న 'వాద్--వివాద్ 2026' ద్విభాషా అంతర్ కళాశాల చర్చా పోటీల రెండో ప్రాథమిక దశ విజయవాడలోని కేఎల్ విశ్వవిద్యాలయంలో బుధవారం జరిగింది. ఆక్వింటాక్స్ ఎడ్యుకేషనల్ ఫౌండేషన్, రోటరీ క్లబ్ విజయవాడ మిడ్‌టౌన్ ఆధ్వర్యంలో, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ యువజన సేవల శాఖ సహకారంతో కార్యక్రమం నిర్వహించారు. 'దేశమే ప్రథమం' అంశంపై వివిధ కళాశాలల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ వాదనా పటిమను ప్రదర్శించారు.

పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు దేశ ప్రగతి, యువత పాత్ర తదితర అంశాలపై తమ అభిప్రాయాలను తార్కికంగా వివరించారు. పోటీలను డాక్టర్ దిలీప్ కిలారు, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయవాది మాధవి కర్ర, అదనపు రవాణా కమిషనర్ (విశ్రాంత) డాక్టర్ ప్రసాద్ సాంకా, కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంలో అంతర్జాతీయ వ్యాపారంలో మాస్టర్స్ చేసిన పాతి లలిత న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ఆక్వింటాక్స్ ఎడ్యుకేషనల్ ఫౌండేషన్, సప్త సింధు వ్యవస్థాపక డైరెక్టర్ సంగీత మిశ్రా నేతృత్వంలో కార్యక్రమం సాగింది.

యువతలో దేశ నిర్మాణంపై చర్చలు, ఆలోచనలు పెంపొందించేందుకు ఇటువంటి వేదికలు ఎంతో అవసరమని సంగీత మిశ్రా పేర్కొన్నారు. యువత భాగస్వామ్యాన్ని ప్రోత్సహించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ యువజన సేవల శాఖ ఈ కార్యక్రమానికి సహకరిస్తోందని నిర్వాహకులు తెలిపారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు శాఖ లోగోతో కూడిన పాల్గొనడం ధ్రువపత్రాలు అందజేయనున్నట్లు వెల్లడించారు. తదుపరి ప్రాథమిక దశ ఈ నెల 23న విజయవాడలోని కేబీఎన్ కళాశాలలో జరగనుండగా, విజయవాడ ప్రాంత సెమీ ఫైనల్స్ ఈ నెల 30న నిర్వహించనున్నారు.

## లంక మోహన్‌రావుకు నక్కా ఆనందబాబు, దేవినేని ఉమా నివాళులు



**ఈపూరు (జర్నలిస్ట్ ఫైల్ ):** వేమూరు నియోజకవర్గం కొల్లూరు మండలం ఈపూరు గ్రామానికి చెందిన లంక మోహన్‌రావు సంస్మరణ సభలో మాజీ మంత్రి, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, మాజీ మంత్రి దేవినేని ఉమా మహేశ్వరరావు పాల్గొని నివాళులర్పించారు. మోహన్‌రావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మోహన్‌రావు కుటుంబ సభ్యులను పరామర్శించిన వారు వారికి ధైర్యం చెప్పారు. మోహన్‌రావు ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. సంస్మరణ సభలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## 'హ్యాపీ క్లాస్‌రూమ్'పై శిక్షణ

**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్ ):** ఉర్దూ ఉపాధ్యాయుల్లో ఆధునిక బోధనా నైపుణ్యాలను పెంపొందించడంతో పాటు తరగతి గదుల్లో సానుకూల, ఉత్సాహభరిత వాతావరణాన్ని కల్పించేందుకు 'హ్యాపీ క్లాస్‌రూమ్: హ్యాపియర్ టీచర్స్, బ్రైటర్ లర్నర్స్' పేరుతో ఒకరోజు శిక్షణా వర్క్‌షాప్‌ను విజయవాడలో నిర్వహించారు. బెంచ్ సర్కిల్ సమీపంలోని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ ఎక్స్‌టెన్షన్ సెంటర్‌లోని సమానా కాలేజ్ ఆఫ్ డిజైన్‌లో సెంటర్ ఫర్ ప్రొఫెషనల్ డెవలప్‌మెంట్ ఆఫ్ ఉర్దూ మీడియం టీచర్స్ , MANUU సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియట్ విద్యా బోర్డు ఉర్దూ విభాగం ప్రత్యేక అధికారి షేక్ నాగుర్‌వలి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రాంతవ్యాప్తంగా 75 మంది ఉర్దూ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. వర్క్‌షాప్‌లో భాగంగా ఉపాధ్యాయుల కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టూల్స్ వినియోగంపై ప్రొఫెసర్ మహమ్మద్ అబ్దుల్ సమీ సిద్ధిఖీ అవగాహన కల్పించారు. బ్లెండెడ్, హైబ్రిడ్ లెర్నింగ్ విధానాలపై డాక్టర్ సహీఫా సుల్తానా వివరించారు. విద్యార్థుల చురుకైన భాగస్వామ్యం, మానసిక వికాసం, ప్రోత్సాహకరమైన బోధనా విధానాలపై ప్రొఫెసర్ అథర్ హుస్సేన్ శిక్షణ అందించారు.

ఉపాధ్యాయులకు నిరంతర శిక్షణ ఎంతో అవసరమని షేక్ నాగుర్‌వలి పేర్కొన్నారు. ఉర్దూ బోధకులకు సమకాలీన నైపుణ్యాలను అందించేందుకు MANUU, CPDUMT చేపట్టిన కార్యక్రమాలను ఆయన అభినందించారు. అనంతరం పాల్గొన్న ఉపాధ్యాయుల నుంచి అభిప్రాయాలను సేకరించి, 75 మంది ఉపాధ్యాయులకు భాగస్వామ్య సర్టిఫికెట్లను అందజేశారు.

## 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం భారత్ దౌత్య శక్తికి, ప్రపంచ నాయకత్వానికి ప్రతీక

- పహల్గామ్ ఉగ్రదాడిని తీవ్రంగా ఖండించిన బ్రిక్స్ సభ్య దేశాలు
- ఉగ్రవాదంపై భారత్ స్పష్టమైన వైఖరికి బ్రిక్స్ దేశాల సంఘీభావం
- ఆంధ్రప్రదేశ్ బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్ ):** భారతదేశం ఆతిథ్యంలో, న్యూఢిల్లీలోని భారత్ మండపంలో ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరుగుతున్న 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం భారతదేశ దౌత్య సామర్థ్యానికి, ప్రపంచ నాయకత్వానికి ప్రతీకగా నిలుస్తోందని ఆంధ్రప్రదేశ్ బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు.

2026 సెప్టెంబరు 12, 13 తేదీల్లో భారతదేశం బ్రిక్స్ అధ్యక్షతన నిర్వహిస్తున్న ఈ ప్రతిష్ఠాత్మక సదస్సు ద్వారా ప్రపంచ వేదికపై భారతదేశానికి పెరుగుతున్న ప్రాధాన్యత మరోసారి స్పష్టమైందన్నారు. బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, దక్షిణాఫ్రికాతో పాటు ఈజిప్ట్, ఇథియోపియా, ఇరాన్, ఇండోనేషియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ తదితర సభ్య దేశాల ప్రతినిధులు పాల్గొంటున్న ఈ సమావేశం ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, వాణిజ్యం, పెట్టుబడులు, సాంకేతికత, ఇంధనం, అభివృద్ధి, అంతర్జాతీయ శాంతి, భద్రత వంటి కీలక అంశాలపై చర్చలకు వేదికగా నిలుస్తోందని తెలిపారు.

**భారత్ దౌత్య శక్తికి నిదర్శనం**

ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత్ నిర్వహిస్తున్న బ్రిక్స్ సదస్సు ద్వారా అభివృద్ధి చెందుతున్న దేశాల గొంతుకను ప్రపంచ వేదికపై మరింత బలంగా వినిపించే అవకాశం లభించిందని పీవీఎన్ మాధవ్ అన్నారు.

ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అభివృద్ధి చెందుతున్న దేశాల పాత్రను పెంచడం, వాణిజ్యం మరియు పెట్టుబడులకు కొత్త అవకాశాలను సృష్టించడం, సాంకేతిక సహకారాన్ని విస్తరించడం, ఇంధన భద్రతతో పాటు స్థిరమైన అభివృద్ధిని ప్రోత్సహించడం వంటి అంశాల్లో బ్రిక్స్ కీలక పాత్ర పోషించగలదన్నారు.

భారత్ అధ్యక్షతన బ్రిక్స్ కూటమి ఆర్థిక సహకారంతో పాటు ప్రపంచ శాంతి, భద్రత, ఉగ్రవాద నిర్మూలనకు కూడా ప్రాధాన్యత ఇవ్వడం అభినందనీయమని పేర్కొన్నారు.

**పహల్గామ్ ఉగ్రదాడిని ఖండించిన బ్రిక్స్ దేశాలు**

జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో అమాయక పర్యాటకులపై జరిగిన దారుణ ఉగ్రదాడిని బ్రిక్స్ దేశాలు తీవ్రంగా ఖండించడం స్వాగతించదగిన పరిణామమని పీవీఎన్ మాధవ్ అన్నారు.

ఉగ్రవాదానికి ఎలాంటి రూపంలోనూ సమర్థన ఉండకూడదని, ఉగ్రవాదులకు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా మద్దతు అందించే శక్తులపై అంతర్జాతీయ సమాజం కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

ఉగ్రవాదాన్ని కేవలం ఖండించడం సరిపోదు. ఉగ్రవాదానికి నిధులు సమకూర్చే వ్యవస్థలు, ఆయుధాల సరఫరా, శిక్షణా కేంద్రాలు, ఆశ్రయం కల్పించే నెట్‌వర్క్‌లు, ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే అంతర్జాతీయ మౌలిక వ్యవస్థలపై సమన్వయంతో చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది అని అన్నారు.

ఉగ్రవాదులపై చర్యలతో పాటు వారికి ఆర్థిక, రాజకీయ, మౌలిక సహకారం అందించే నెట్‌వర్క్‌లను కూడా అంతర్జాతీయ సమాజం గుర్తించి అడ్డుకోవాలని సూచించారు.

**భారత్ పోరాటానికి అంతర్జాతీయ మద్దతు**

పహల్గామ్ ఉగ్రదాడిని ఖండిస్తూ బ్రిక్స్ దేశాలు ఉగ్రవాదంపై కఠిన వైఖరిని వ్యక్తం చేయడం భారత్ చేస్తున్న ఉగ్రవాద వ్యతిరేక పోరాటానికి అంతర్జాతీయంగా లభిస్తున్న మద్దతుకు నిదర్శనమని పీవీఎన్ మాధవ్ అన్నారు.

ప్రపంచంలో ఎక్కడ ఉగ్రవాదం జరిగినా దాన్ని ఏ రూపంలోనూ సమర్థించకూడదని, ఉగ్రవాదంపై 'డబుల్ స్టాండర్డ్స్' లేకుండా అంతర్జాతీయ సమాజం ఏకతాటిపైకి రావాల్సిన అవసరం ఉందన్నారు.

బ్రిక్స్ వంటి అంతర్జాతీయ వేదికలు కేవలం ఆర్థిక సహకారానికే పరిమితం కాకుండా ప్రపంచ శాంతి, భద్రత, ఉగ్రవాద నిర్మూలన, సైబర్ భద్రత, సరిహద్దు దాటి జరిగే ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో సమష్టి కార్యాచరణకు వేదికలుగా మారాలని ఆకాంక్షించారు.

**దేశ భద్రత విషయంలో రాజీపడని మోదీ ప్రభుత్వం**

భారతదేశ భద్రత, సార్వభౌమత్వం, ప్రాదేశిక సమగ్రత విషయంలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడదని పీవీఎన్ మాధవ్ స్పష్టం చేశారు.

దేశ భద్రత, సరిహద్దుల రక్షణ, ఉగ్రవాద నిర్మూలన కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు ప్రతి భారతీయుడు అండగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రపంచంలో భారత్ ప్రభావం పెరుగుతున్న సమయంలో, బ్రిక్స్ వంటి కీలక అంతర్జాతీయ వేదికకు భారత్ నాయకత్వం వహించడం దేశానికి గర్వకారణమని అన్నారు.

భారత్ అధ్యక్షతన జరుగుతున్న 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం ప్రపంచ దేశాల మధ్య ఆర్థిక సహకారం, వాణిజ్యం, సాంకేతిక భాగస్వామ్యం, పెట్టుబడులు, పరస్పర సంబంధాలతో పాటు ప్రపంచ శాంతి, భద్రతను మరింత బలోపేతం చేసే దిశగా విజయవంతం కావాలని పీవీఎన్ మాధవ్ ఆకాంక్షించారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467